నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
వైఎస్ఆర్ కడప
ఆదివారం 09 మార్చి 2025 : పేజీలు 8

# మరో బియ్యం లారీ పట్టివేత



**600 బియ్యం బస్తాలు స్వాధీనం**
**లారీని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**బద్వేల్, మేజర్‌న్యూస్ :**
బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరు రోడ్డులో తనిఖీలో భాగంగా సీఐ రాజగోపాల్ అనుమానాస్పదంగా ఉన్న 600 బస్తాల బియ్యాన్ని స్వాధీనపరుచుకున్నట్లు విశ్వనీయ సమాచారం. వివరాలోకి వెళితే శుక్రవారం రాత్రి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా జమ్మలమడుగు నుంచి చెన్నై కి వెళుతున్న లారీని పోలీస్ సిబ్బంది ఆపి విచారించగా డ్రైవర్ చెప్పిన సమాచారం మేరకు జమ్మలమడుగు నుంచి చెన్నైకి బియ్యం తీసుకెళ్తున్నామని



# రంగంలోకి సిట్

- రంగన్న మృతదేహానికి రీపోస్టుమార్టం
- నమూనాలు సేకరించిన ఫోరెన్సిక్ నిపుణులు
- పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలింపు
- వివేకా హత్య కేసులో ఇతర సాక్షుల మరణాలపై లోతైన విచారణ

కడప, మేజర్‌న్యూస్ బ్యూరో


మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి, వాచ్మెన్ రంగన్న అనుమానాస్పద రీతిలో మృతి చెందడంపై ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. దీంతో సిట్ బృందం శనివారమే విచారణ ప్రారంభించింది. రంగన్న మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించారు. పులివెందుల భాకరాపురం శ్మశానవాటికలో రీపోస్టుమార్టం చేశారు. తిరుపతి, మంగళగిరి ఫోరెన్సిక్ నిపుణులు, వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి మృతదేహం నుంచి కొన్ని నమూనాలు సేకరించారు. వీటిని ల్యాబ్ కు తరలించారు. రంగన్న మృతిపై అనుమానాలున్నాయని ఆయన భార్య ఆరోపణలు చేయడంతో.. సందేహాల నివృత్తి కోసం మరోసారి పోస్టుమార్టం చేశారు. మృతదేహంపై గాయాలు ఉన్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించారు.



## మహిళాసాధికారతే
# లక్ష్యం

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతి
- మహిళలు అన్ని రంగాలలో ధైర్యంగా ముందుకు రావాలి
- మహిళల పట్ల ప్రతిఒక్కరు గౌరవంగా మెలగాలి
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమం, జిల్లా ఇంఛార్జి మంత్రి ఎస్. సవిత

**కడప, మేజర్‌న్యూస్ ప్రతినిధి :**
రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం అందుకు తగ్గట్లే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల కోసం ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర బిసి సంక్షేమం, జిల్లా ఇంఛార్జి మంత్రి ఎస్. సవిత అన్నారు. శనివారం స్థానిక సాయి శ్రీనివాస్ గార్డెన్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం అతి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి సవిత మాట్లాడుతూ స్త్రీలు ఎక్కడ గౌరవించబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు అని నమ్మిన సమాజం మనది. ఒక పురుషుడి విజయం వెనుక తల్లిలా, తోబుట్టువులా, భార్యలా ఓ స్త్రీ మూర్తి ఎప్పుడూ ఉంటుందన్నారు. ఓ సమాజం ఉన్నతంగా ఉందన్నా...ఓ కుటుంబం మంచిగా ఉందన్నా అందుకు కారణం మిగతా 2పేజీలో



## రోడ్ల అభివృద్ధి నాణ్యతలో
# రాజీకి తావులేదు


- అధికారులకు సూచించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
- జిల్లా ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి సమీక్ష

2లో



## జాతీయ లోక్ అదాలత్ లో
# 6053 కేసులు పరిష్కారం

రూ.15.58 కోట్ల చెల్లింపులు




2లో

# మరో బియ్యం లారీ పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

చెప్పడంతో డ్రైవర్ చెప్పిన మాటలు అనుమానస్పదం రావడంతో వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారని అనుమానంతో లారీతో సహా 600 బియ్యపు బస్తాలను డ్రైవరును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై పోలీసు అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ద్వారా బియ్యాన్ని ల్యాబ్‌కు పంపించి ఇవి రేషన్ బియ్యం అవునా కాదా నిర్ధారణకు వచ్చినప్పుడు తెలుపుతామని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

### రోడ్ల అభివృద్ధి నాణ్యతలో

# రాజీకి తావులేదు

**కడప, మేజర్‌న్యూస్ ప్రతినిధి :**

రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధిలో, నాణ్యతలో ఎక్కడా రాజీకి తావులేదని.. అధికారులు చిత్తశుద్ధితో పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా పర్యటనలో భాగంగా శనివారం కడప జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి స్థానిక కడప గెస్ట్ హౌస్ లో జిల్లా ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో రోడ్ల అభివృద్ధి పనులు, గుంతల రహిత రోడ్ల మరమ్మతులు పనులుపై మంత్రి ఆర్,బీ శాఖ అధికారులను ఆరా తీశారు. కడప జిల్లా పరిధిలో గుంతల రహిత రోడ్ల కార్యక్రమంలో భాగంగా 219 పనులు గాను 35 కోట్లు కేటాయించగా, 97 శాతం పనులు ఇప్పటి వరకు పూర్తి చేసినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.. అలాగే కడప బైపాస్ కు 14 కిలోమీటర్లు గుంతలు పూడ్చుడానికి ఒప్పందం పూర్తయినట్లు, త్వరలోనే పనులు ప్రారంభించి 10 రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు తెలియజేశారు. అలాగే ఇర్ ఖాన్ సర్కిల్ నుండి ఊట్కూరు (ఆర్ఓబి) వరకు 6 కి.మీ గుంతలు పుడ్చే పనులు ప్రారంభించినట్లు తెలియజేశారు.త్వరలోనే 100 శాతం గుంతల రహిత జిల్లాగా మారుస్తామని అధికారులు మంత్రి తెలియజేశారు. రోడ్ల అభివృద్ధి కార్యక్రమాల నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దని, సకాలంలో బిల్లులు అప్లోడ్ చేసి కాంట్రాక్టర్ లకు చెల్లింపులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి సూచించారు.

# 6053 కేసులు పరిష్కారం

**కడప , మేజర్ న్యూస్ ప్రతినిధి :**

జాతీయ లోక్‌అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 6053 కేసులు పరిష్కరించి 15 కోట్లు, 58 లక్షలు, 91 వేలు, 342 రూపాయల మొత్తము కక్షిదారులకు చెల్లించడం జరిగినది. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, అమరావతి ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 16 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగినది. కడపలో 5, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 3, రాయచోటి లో 2, బద్వేల్ లో 2, జమ్మలమడుగులో 1 బెంచిని ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జి. శ్రీదేవి మాట్లాడుతూ.. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.దినబాబు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జ్ కం చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కే.ప్రత్యూష కుమారి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి జిసి.ఆసిఫా సుల్తానా, ఎక్సైజ్ కోర్టు జడ్జ్ జె.హేమ స్రవంతి, మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం.ఆశాప్రియ, కడప బార్ అసోసియేషన్ బార్ ప్రెసిడెంట్ జి. గుర్రప్ప, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో జిల్లా వ్యాప్తంగా 6053 కేసులు పరిష్కరించబడినవి. 15 కోట్లు, 58 లక్షలు, 91 వేలు, 342 రూపాయలు మొత్తము కక్షిదారులకు చెల్లించడం జరిగినది. జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, లోక్ అదాలత్ మెంబెర్స్, కక్షిదారులు వారి వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి వారి కేసులను పరిష్కరించుకోవడం జరిగినది. ప్రత్యేక మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగినది. జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసినందులకు గాను న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు అధికారులకు, వైద్య అధికారులకు, డిస్టిక్ పబ్లిక్ రిలేషన్ అధికారులకు, పత్రికా సిబ్బంది కి, రవాణాశాఖ అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ అధికారులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ అధికారులకు, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులకు, ఆల్ ఇండియా రేడియో కడప వారికి, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ క్లర్కులకు, అగ్రికల్చరల్ అధికారులకు మరియు మిగతా శాఖల అందరికీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జి. శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

# రంగంలోకి సిట్

(మొదటి పేజీ తరువాయి)

2019 నుంచి ఇప్పటి వరకు వైఎస్ వివేకా హత్య కేసులో కీలక సాక్షులు ఆరుగురు మరణించడం వెనకున్న కారణాలను నిగ్గు తేల్చడానికి కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. ఈ సిట్?లో జమ్మలమడుగు, పులివెందుల డీఎస్పీలతో పాటు ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు, 10 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరితోపాటు సాంకేతిక, ఫోరెన్సిక్ బృందం కూడా సిట్?లో ఉన్నారు. వీరంతా గడిచిన ఆరేళ్లలో ఆరుగురు సాక్షులు వివిధ అనారోగ్య కారణాలతో మృతి చెందినా అవి సహజ మరణాలా లేక అసహజ మరణాలా అనే విషయాన్ని తేల్చేందుకు సిట్ బృందం క్షేత్రస్థాయి పర్యటన మొదలు పెట్టింది. ఈ క్రమంలో సాక్షుల మరణాలపై పూర్తిస్థాయి వివరాలు తెలుసుకునేందుకు సిట్ బృందం పని ప్రారంభించింది. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్?తో సిట్ బృందం సమావేశమై విచారణలో తేల్చాల్సిన అంశాలను చర్చించారు. ఏవిధంగా దర్యాప్తు సాగించాలనే దానిపై ఎస్పీ సిట్?కు దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది. ఇప్పటికే సిట్ అధికారులు ప్రాథమికంగా సాక్షుల వివరాలను సేకరిస్తున్నారు. మూడు రోజుల కిందట వివేకా ఇంటి వాచ్ మెన్ రంగన్న మృతిపై భార్య సుశీలమ్మ ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ యాక్ట్ 194 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రంగన్న మృతే కాకుండా అసలు ఆరేళ్లలో అనుమానాస్పదంగా చనిపోయిన సాక్షుల వివరాలను లోతుగా విచారించేందుకు సిట్ దర్యాప్తు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా శనివారం పులివెందులలోని భాకరాపురంలో పూడ్చిన రంగన్న మృతదేహాన్ని వెలికితీసి రీపోస్ట్ మార్టం నిర్వహించారు. ఇందులో తిరుపతి ఎఫ్ఎస్ఎల్ టీం, కడప వైద్య బృందంతో పాటు ఫోరెన్సిక్ బృందం సభ్యులు పాల్గొన్నారు. మృతి వివరాలు పూర్తిస్థాయిలో తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ బృందం కొన్ని నమూనాలు సేకరించి తరలించినట్లు తెలుస్తోంది.

**మిగిలిన వారిపై కూడా విచారణ..**

కాగా వివేకా హత్య కేసులో సాక్షులుగా ఉండి మృతి చెందిన ఆరుగురి మరణాలపై కూడా సిట్ బృందం విచారణ ప్రారంభించింది. 2019 సెప్టెంబరు 1న సింహాద్రిపురం మండలం కసనూరుకు చెందిన శ్రీనివాసులరెడ్డి పురుగుమందు తాగి చనిపోయాడు. అతని మరణంపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. శ్రీనివాస్ రెడ్డి మరణంపై సిట్ విచారణ చేసే అవకాశం ఉంది. అదేవిధంగా 2022 జూన్ 9న కువైట్ గంగాధర్ రెడ్డి అనంతపురం జిల్లా యాడికిలో చనిపోయాడు. వివేకా కేసు తనపై సీబీఐకి వాంగ్మూలం ఇచ్చాడు. తర్వాత అతను అనారోగ్య కారణాలతో మృతి చెందాడని చెబుతున్నారు. సిట్ బృందం మృతుని కుటుంబ సభ్యులను విచారించే అవకాశం ఉంది. ఇక జగన్ కారు డ్రైవర్ నారాయణ యాదవ్ మృతిపై విచారణ చేయనుంది. 35 ఏళ్ల పాటు వైఎస్ కుటుంబంలో ఒకడిగా పనిచేసిన నారాయణ యాదవ్?ది సత్యసాయిజిల్లా ముదిగుబ్బ మండలం ఎగువపల్లె. 2019 డిసెంబర్ 6న నారాయణ యాదవ్ చనిపోయాడు. ఆయన మరణం పై కూడా సిట్ సభ్యులు దృష్టి సారించారు. వీరితోపాటు వైఎస్ జగన్ కుటుంబ సభ్యులైన ఈసీ గంగిరెడ్డి, వైఎస్ అభిషేక్ రెడ్డి మరణాలపై కూడా సిట్ విచారించనుంది. ఏది ఏమైనప్పటికీ వాచ్ మెన్ రంగన్న మరణంపై ప్రత్యేక సాంకేతిక నిపుణులు, ఫోరెన్సిక్ బృందాలతో విచారణ చేయిస్తామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఇదివరకే స్పష్టం చేశారు. సాక్షుల మరణాలపై అన్ని కోణాల్లో విచారించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని ఎస్పీ తెలిపారు.

# మహిళా సాధికారతే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



స్త్రీమూర్తే అని తెలిపారు. పురుషులతో సమానంగా ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లోనూ సత్తా చాటుతున్నారని, క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకు పోతున్నారన్నారు.వ్యాపార రంగాల్లోనే కాదు సమాజ సేవలోనూ, రాజకీయ రంగంలోనూ మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారన్నారు. ప్రపంచాన్ని పాలించే శక్తి కలిగిన స్త్రీ మూర్తులు సమాజాంలోని కొన్ని అవలక్షణాల కారణంగా తీవ్ర వివక్షకు గురవుతున్నారు. మహిళలు వంట గదులకే పరిమితమవుతున్న వేళ ఓ మహానీయుడు పుట్టుకొచ్చాడు..ఆయనే అన్న ఎన్టీఆర్.. సమాజమే దేవాలయం...ప్రజలే దేవుళ్లు అంటూ.. నినదించారన్నారు. మహిళలతోనే మెరుగైన సమాజం సాధ్యమని భావించి రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేశాడు ఆస్తిలో మహిళలకు సగం వాటా కల్పించాడు ఎన్టీఆర్ చొరవతో వంట గదులకే పరిమితమైన మహిళలు చట్ట సభల్లో ఆశీనులయ్యారు. సమాజాభివృద్ధికి మెరుగైన శాసనాలు చేశారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న ప్రస్తుత మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు అన్నింటా ప్రాధాన్యమిస్తున్నారు. విద్య, ఉద్యోగవకాశాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చారు. మహిళలతోనే సమాజాభివృద్ధి అని ముఖ్యమంత్రి గుర్తిస్తూ సంపద సృష్టిలో మహిళలను భాగస్వాములను చేస్తున్నారని తెలిపారు. 2014-19లోగాని, ప్రస్తుత పాలనలోగాని మహిళలకు ఆర్థిక లబ్ధి కలిగేలా పథకాలు రూపొందిస్తున్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళను వ్యాపారవేత్తగా చేయాలన్న లక్ష్యంతో ఎంఎస్ఎంఈ యూనిట్లు, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది లక్షమంది మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దనున్నామన్నారు. లక్ష మందికి పైగా మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్నామన్నారు. పురుషులతో పోల్చుకుంటే.. మహిళల్లో ఓపిక ఎక్కువ. అంతే కాక తెలివి కూడా ఎక్కువ అన్నారు. ఆకాశంలో సగం, దేవతలలో సగభాగం మహిళలు అని అన్నారు. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలను చదివించాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి భావించి డ్వాక్రా సంఘాలను స్థాపించి నేడు వారిని లక్షాధికారులను చేశారన్నారు. అనంతపురం జిల్లా పెనుకొండ కు ఎమ్మెల్యే కావాలని మా అమ్మ కోరిక అని..ఎన్నో అడ్డంకులను అధికమించి నేడు మంత్రి స్థాయికి ఎదగగలిగానని మంత్రి అన్నారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హాజరైన మహిళలతో పాటు జిల్లాలో ఉన్న మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు

**మరింత వేగంగా అభివృద్ధి సాధించాలి..**

జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...మహిళా మూర్తులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందడలో మనం 5వ స్థానంలో ఉన్నామన్నారు. ఈ సంవత్సరంలో మరింత వేగంగా అభివృద్ధి చెందాలని పెద్దలు నిర్ణయించి ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు.గతంలో మాదిరిగా వంటింటికే పరిమితం కాకుండా నేడు మహిళలు ముందుకు వచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారు. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల ద్వారా అభివృద్ధి సాధ్యమని నమ్మి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచాలని డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారు. వారి ఆలోచనే నేడు మహిళా సంఘాలు సాధిస్తున్న అభివృద్ధి మన కళ్ళ ముందు కనిపిస్తుందన్నారు. అన్ని కార్పొరేషన్ల ద్వారా రుణాలు మహిళల అభివృద్ధికి మంజూరు చేస్తున్నాం. గతంలో రూ.600 కోట్ల నుండి 650 కోట్లు రుణాలు ఇచ్చేవారం. అయితే ప్రస్తుతం బ్యాంకుల ద్వారా రూ1500 కోట్ల రుణాలు ఇస్తున్నాం.. ఇది మహిళల అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఎంతో ఆర్థికంగా అభివృద్ధి చెందినా.. ఆడబిడ్డలను ఇంకా సమాజంలో చిన్నచూపు చూడడం సరికాదన్నారు. మన జిల్లాలో కొంత మంది 8వ తరగతి నుండి 10 వతరగతిలోపు ఆడబిడ్డల విద్యను మాన్పిస్తున్నారు. ఇది తప్పు. మీ వీధిలో, మీ గ్రామంలో కానీ, మీకు తెలిసిన వెంటనే వారి తల్లిదండ్రులకు విద్య విలువను చెప్పి ఆడబిడ్డల చదువును ప్రోత్సహించాలన్నారు. ప్రపంచం అభివృద్ధి చెందుతుందంటే మహిళలు ఆత్మస్థైర్యంతో ధైర్యంగా ముందుకు వెళ్తూ..అభివృద్ధిలో భాగం అవుతున్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.మహిళకు విద్య ఎంతో అవసరమని, అవకాశాలు కల్పిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలదన్నారు. కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి రెడ్డి మాట్లాడుతూ మహిళలు బహుముఖ ప్రజ్ఞాశాలులని అన్ని పనులు చేసుకోగలరని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 2027 విజన్‌తో పని చేస్తూ మహిళా సాధికారతకు అహర్నిశలు కృషి చేస్తూనారన్నారు. మహిళా అభివృద్ధి కొరకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి మహిళలకు అవకాశం కల్పించడం జరుగుతోందని అన్నారు. మహిళలకు ఎన్ని సమస్యలు ఉన్నా వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని, బలహీనతను బలంగా మార్చుకోవాలని అన్నారు. టిడిపి అధ్యక్షులు, పొలిట్ బ్యూరో శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మహిళలు ధైర్యంగా ముందుకు వెళ్లి అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. మహిళలకు ప్రస్తుతం 33 శాతం రిజర్వేషన్ ఉందని దానిని 50 శాతం వచ్చి చట్ట సభల్లో రాణించాలన్నారు. విద్య వల్లే మహిళా సాధికారత సాధ్యమని అన్నారు. తొలుత జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభమైనది. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలు అందించిన జిల్లా లోని మహిళా అధికారులు, అన్ని శాఖలలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులను జ్ఞాపికలు అందించి సత్కరించారు. రాష్ట్ర బిసి సంక్షేమం, జిల్లా ఇంఛార్జి మంత్రి ఎస్. సవిత చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్, డీఆర్డీఏ, మెప్మా పిడీలు శ్రీలక్ష్మి, ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, ఎస్సి కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



మైదుకూరు, మేజర్‌న్యూస్ : మైదుకూరు సిహెచ్‌లో, బద్వేల్ డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జరిగిన అబర్షన్స్ గురించి అడిట్ చేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఓ వి.మల్లేష్, గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీలలితలు. ఈ కార్యక్రమంలో డి. వెంకటేశ్వర్లు హెల్త్ సూపెర్వేజర్, డివిజన్ లోని, సూపెర్వైజర్స్, ఎఎన్‌లు, ఆశాలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

### ఎస్ఐ వెంకటరమణ




**రాజుపాళెం, మేజర్‌న్యూస్:** గ్రామీణ ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి వాటి బారిన పడకుండా జాగ్రత్త పడాలని రాజుపాళెం ఎస్.ఐ. కె.వెంకటరమణ సూచించారు శనివారం అర్కట వేముల గ్రామంలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రజలకు సైబర్ క్రై మ్, రోడ్డు ప్రమాదాలు పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఎక్కువగా ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారన్నారు ఈ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం వల్ల వాటి బారిన పడకుండా తప్పించుకోవచ్చు అన్నారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 సంప్రదించాలన్నారు రోడ్డు ప్రమాదం జరగకుండా వాహ నదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు అతివేగంగా వాహనాలు నడపకూడదని ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని తెలిపారు.

## అఖిలభారత అగ్రగామి మహిళా సమితి ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**కడప, మేజర్‌న్యూస్:** అఖిలభారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కోటపాటి సుబ్బమ్మ ఆధ్వర్యంలో కడప నగరంలోని ఓం శాంతినగర్ లో నెలకొని ఉన్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయం నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా సందర్భంగా మహిళా సమితి ఆధ్వర్యంలో మొదట నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా సమితి ఆధ్వర్యంలో కడప నగరం చుట్టుపక్కల ప్రాంతాల మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కోటపాటి సుబ్బమ్మ , రాష్ట్ర కార్యదర్శి అరుణ కుమారీ లు మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ కెప్టెన్ లక్ష్మీ సేహగల్ స్ఫూర్తితో అఖిల భారత అగ్రగామి మహిళా సమితి పోరాటంతో ముందుకు సాగుతుందని వారు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను అమలుపరచడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఆమె వాపోయారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మరియు ప్రతి ఒక్క మహిళకు నెలకు 1500 వంటి పథకాలు హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేయడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, భద్రత కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని ఆమె ఆరోపించారు. చిన్నపిల్లలు మొదలుకొనీ నిత్యం మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని ఆమె వాపోయారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలల కు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాబోయే కాలంలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, మహిళా నేతలు హరిత, మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు



**కడప, మేజర్‌న్యూస్ :** ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని మాజీ మహిళా ఉపాధ్యక్షురాలు శ్యామలమ్మ, మాజీ నగర మహిళా అధ్యక్షురాలు నాగరత్న గౌడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసిసి అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి హాజరయి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వారికి ప్రత్యేక స్థానం ఉందని ఎల్లవేళలా వారిని గౌరవించాలని విజయ జ్యోతి కోరారు. అనంతరం వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా పోస్టర్ విడుదల వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన పెంచడానికి మైనారిటీ జిల్లా అధ్యక్షులు రహమతుల్లా ఖాన్ సిద్ధం చేసిన గోడపత్రికలను ఎన్.డి. విజయజ్యోతి విడుదల చేశారు. మహిళా దినోత్సవ సందర్భంగా గంగా భవాని పాఠశాల ప్రధాన అధ్యాపకురాలు మేరీ, హిందీ ఉపాధ్యాయురాలు పుష్పకుమారి గాంధీనగర్ హై స్కూల్ వారిని ఈ సందర్భంగా మహిళా నాయకురాలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిటీ అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, మైనార్టీ క్రిస్టియన్ జిల్లా అధ్యక్షురాలు పిడి సంజయ్ కాంత, తులసి (ప్రొద్దుటూరు), సుబ్బమ్మ, సంతోషమ్మ, మామిళ్ళ బాబు, అబ్దుల్ సత్తార్, మల్లెం విజయభాస్కర్, కదిరి ప్రసాద్ గౌడ్, రఫీఖ్ ఖాన్, సయ్యద్ గౌస్ పీర్, సిరాజుద్దీన్, ముబారక్, చిన్న కుల్లాయప్ప, ఆసిఫ్ ఖాన్, కమల్ భాష, హమీద్ ఖాన్, రాహంతుల్లా ఖాన్, శీలం గంగయ్య, జహూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రం



**కలసపాడు మేజర్‌న్యూస్:** కడపలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలలో ఉత్తమ సేవలకు లింగారెడ్డి పల్లె పంచాయతీ సెక్రెటరీ సుర రేణుక దేవి కి కడప జిల్లా శ్రీ సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి చైతులమీదగా ప్రశంస పత్రం అందుకున్నారు ఈ ప్రశంసా పత్రం రావడం పట్ల మండలంలోని పంచాయతీ సెక్రటరీలు ఎంపీడీవో సిబ్బంది సచివాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు

## ఘనంగా శ్రీ గంగమ్మ జాతర మహోత్సవాలు



**కడప సిటీ, మేజర్‌న్యూస్:** నగరంలోని పాలెంపల్లె, రూకవారి పల్లెలో వెలసి ఉన్న శ్రీ గంగమ్మ తల్లి దేవాలయం జాతర ఉత్సవాలను పురస్కరించుకొని, ఆ దేవాలయం చైర్మన్ పాలెంపల్లి జయభారత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పాలెంపల్లి జయ భారత్ రెడ్డి ఘనంగా అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగరంగ వైభవంగా శ్రీ శ్రీ శ్రీ గంగమ్మ తల్లి జాతర ఉత్సవాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు .భక్తులు ఆశేష జనవాహినిలో పాల్గొని, గంగమ్మ తల్లి కు పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఆశీస్సులు అందుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, భక్తాదులు పాల్గొన్నారు.

## మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి



**వేంపల్లె,మేజర్‌న్యూస్:** దేశంలోని అన్ని రంగాల్లో మహిళలకు కూడ సమాన అవకాశాలు కల్పిస్తే దేశపురోభివృద్ధి జరుగుతుందని వికాస్ పాఠశాల వ్యవస్థాపకుడు నజీర్‌భాష తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక వికాస్ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడు కుటుంబ వ్యవస్థ కూడా బలపడుతుందని చెప్పారు. మహిళలు తల్లిగా, చెల్లిగా, అక్కగా కూతురిగా ప్రతిరోజు గౌరవించబడినప్పుడే మహిళా సాధికారికత సాధ్యమవుతుందని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం రఫీయా, ఉపాధ్యాయులు పద్మ ,అశ్వాన ,అబీదాలను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## చౌక బారు నీచరాజకీయాలతో చంద్రబాబు కాలయాపన

### షర్మిలమ్మ, చంద్రబాబు ట్రాప్‌లో విమర్శలు చేస్తుంది





**వేంపల్లె మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో చౌకబారు రాజకీయాలతో కాలయాపన చేస్తున్నారని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సతీష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి చనిపోతే ఆ వ్యక్తిని కూడా చిల్లర రాజకీయం కోసం 45 నిమిషాలు పాటు క్యాబినెట్ సమావేశంలో మాట్లాడ వంటే నీ స్థాయి ఎటువంటిదో ప్రజలందరికి అర్థం అవుతుందన్నారు. చంద్రబాబు నాయుడు ఒక గొప్ప మిషనరీగా ప్రాజెక్టు చేయబడ్డావని దేశమంతా కూడా ఎదురు చూస్తున్నటువంటి రోజులు ఉన్నాయని చెప్పి అందరూ చెప్పుకునే వాళ్ళు అయితే ఎక్కడికి పోయింది నీ పరిపాలన దక్షితని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఎటువంటి అవినీతి జరగకుండా ప్రతి సామాన్య ప్రజలకు సంక్షేమ పథకాలు డైరెక్ట్ గా అందజేసినటువంటి గొప్ప నాయకుడు అన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా రూ 2.80 వేల కోట్లు ప్రజల ఖాతాలో జమ చేయడం జరిగిందని చెప్పారు. రాష్ట్రానికి 750 మెడికల్ కాలేజీ సీట్లు తీసుకొని వస్తే వాటిని వద్దని వెనక్కి రాసిన ఇచ్చిన దౌర్భాగ్య ప్రభుత్వం కాదా మీది అన్నారు. అలాగే మెడికల్ కళాశాలలు ప్రయివేటు వ్యక్తులకు అప్పగించి వ్యాపారం చేయడం ఇంత కన్నా దౌర్భాగ్య కూటమి ప్రభుత్వంది కాదా అని విమర్శించారు. సామాన్య విద్యార్థులకు ఉన్నత విద్య అభ్యసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ కళాశాలను మంజూరు చేస్తే వాటికి నిధులు ఇచ్చుకోలేక పేద విద్యార్థులపైనే ఆర్థిక భారం పెట్టడం ఎంత వరకు సమంజసమని చెప్పారు. ప్రతి కార్యక్రమంలోను కమీషన్లు వచ్చేది వాస్తవం కాదా అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల నుంచి సామాన్య ప్రజలు ఏమి కొనుగోలు చేయాలన్నా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వ్యాపారవృద్ధి పరంగా 30 శాతం వ్యాపారాలు కూడ జరగలేని పరిస్థితి ఉందన్నారు. ఏదో సంపద సృష్టితారని గొప్పలు చెప్పుకున్న సిఎం చంద్రబాబు అన్ని రంగాల్లో ఘోర వైఫల్యం చెందారని తెలిపారు. మీ యొక్క పత్రికలు, చానల్‌లు దుష్ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు మాయ మాటలు చెప్పుకోవడం చూస్తుంటే విడ్డూరం ఉందన్నారు. వివేక హత్య కేసులో జగన్ సతీమణి భారతి, నారాయణ యాదవ్‌తో పాటు చనిపోయిన ఇసి గంగిరెడ్డి, అభిషేక్ రెడ్డి పేర్లను చేర్చిన విష సంస్కృతి చంద్రబాబుది అన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకం పేరుతో మహిళలను ఘోరంగా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని చెప్పారు. జగన్ ప్రభుత్వంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించడం జరిగిందని చెప్పారు. నీ అపద్దాలు, దుష్ప్రచారాలు నమ్మి ప్రజలు నీకు పట్టం కట్టారని చెప్పారు. కాని ఈరోజు ప్రజలకు నమ్మించి మోసం చేశారని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయానికి కరెంటు కోతలు, త్రాగునీటికి ప్రజలు అల్లాడుతున్నారని చెప్పారు. ఇచ్చిన హామీలు అన్ని గాలిలోకి కలిసి పోయాయి అన్నారు. హామీలను అమలు చేయాలని లేకపోతే సిఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పైన విమర్శలు చేస్తే వారిపైన తప్పుడు కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి నాయకులు విమర్శలు చేస్తే కేసులు ఉండవని చెప్పారు. కూటమి ప్రభుత్వం పాలనలో ఎక్కువగా మహిళలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని చెప్పారు. సోషియల్ మీడియాలో కూటమి నేతలు మాత్రం విచ్చల విడిగా మాట్లాడవచ్చు అన్నారు. అదే వైఎస్ఆర్ సిపి నేతలు మాట్లాడితే అరెస్టులు చేస్తారని తెలిపారు. షర్మిలమ్మ కూడ చంద్రబాబు ట్రాప్ లో పడి జగన్ పై విమర్శలు చేయడం శోచనీయం అన్నారు.

## మహిళామూర్తులకు ఘన సన్మానం



**కడప సిటీ, మేజర్‌న్యూస్:** నగరంలోని అల్మాస్‌పేటలో ఉన్న ప్రధాన మంత్రి కౌశల్ కేంద్ర స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో సేవలందిస్తున్న మహిళలకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ విద్యావేత్త ఎం. కేశవరెడ్డి, ప్రముఖ సీనియర్ న్యాయవాది గ్రహీత డాక్టర్ ప్రభాకర్ జాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళా పాత్ర చాలా కీలకమైనదని, మహిళలు అనుకుంటే దేనినైనా సాధించవచ్చన్నారు. మన భారత దేశం రాష్ట్రపతి కూడా మహిళ అని, మహిళలు అందిస్తున్న సేవలను కొనియాడారు. అలాగే సీనియర్ యోగా గురువు, బ్రాహ్మణ సంఘం నగర మహిళా మాజీ అధ్యక్షురాలు కే పద్మ గత 25 సంవత్సరాల నుండి యోగాలో ఉచిత సేవలందిస్తున్నారని చెప్పారు. మానసిక వికలాంగుల ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఎం. మమత గత 15 సంవత్సరాల నుండి సేవలందించడం ప్రశంసనీయమన్నారు. ప్రధాన మంత్రి స్కిల్ సెంటర్ మేనేజర్ ఎస్ కె అంజుమ్ గత 10 సంవత్సరాల నుండి స్కిల్ సెంటర్ నందు ఉపాధి కల్పిస్తూ సేవలందించడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా సొసైటీ సభ్యులు, స్కిల్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ ఏవోగా పరిపూర్ణ అరుంధతి



**ముద్దనూరు మేజర్‌న్యూస్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముద్దనూరు ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారిగా ఉద్యోగం చేస్తున్న పరిపూర్ణ అరుంధతిని ఉత్తమ పరిపాలన అధికారిగా జ్ఞాపిక అందించి, జిల్లా ఆఫీసర్లు జిల్లా కేంద్రంలో సత్కరించడం జరిగిందని ముద్దనూరు ఎంపీడీవో ముకుందా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ముకుంద రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## ఉత్తమ సేవలకు పురస్కారం



**వేముల, మేజర్‌న్యూస్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు గాను శనివారం ఉదయం కడప జిల్లా కేంద్రం లో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్,జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆధ్వర్యంలో ఉత్తమ సేవలకు పురస్కారాలు అందజేశారు. ఇందులో భాగంగా వేముల మండలం వేముల క్లస్టర్ లో సిసిగా పని చేస్తున్న టీ.జ్యోతి పులివెందుల నియోజక వర్గంలోని 7 మండలాలకు సంబంచిన మహిళా సిబ్బంది నుండి సీసీ జ్యోతి నీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్బంగా ఉత్తమ సేవలు అందించిన సీసీ గా ఎంపిక చేసి కలెక్టర్ గారి ఆధ్వర్యంలో కడప ఇంచార్జి మంత్రి సవిత చేతుల మీదుగా అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా సీసీ జ్యోతి మాట్లాడుతూ ఈ అవార్డు రావడం మరింత బాధ్యత పెంచింది అని,అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజూ ఈ అవార్డు రావడం ఎంతో సంతోషం గర్వకారణం అని,డ్వాక్రా మహిళలకు మరింత బాధ్యత తో పని చేస్తా అని ఆమె అన్నారు.


## మహిళ సాధికారతే లక్ష్యంగా వారు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### డి.ఎస్.పి రాజేంద్రప్రసాద్..



**బద్వేల్ మేజర్‌న్యూస్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భముగా మహిళ సాధికారతే లక్ష్యంగా వారు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భముగా శనివారం బద్వేల్ అర్బన్, రూరల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జండా ఊపి ప్రారంభించారు. స్థానికజడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు, ఆశా వర్కర్లు మరియు డ్వాక్రా సంఘాలు, మహిళలచే ప్రధాన రహదారులు వెంబడి భారీ ర్యాలీ నిర్వహించారు ర్యాలీలో విద్యార్థినులు మహిళలు మహిళలు ఉన్నత శిఖరాలు అవరోదించాలని అంటూ నినాదాలు చేసుకుంది ముందుకు సాగారు. ఈ సందర్భముగా మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్, అర్బన్ సిఐ రాజగోపాల్, రూరల్ సీఐ నాగభూషణం, జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించిమాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితము కాకుండా రాజకీయ పరంగా గాని ఉన్నత విద్యలలో గాని వ్యాపార రంగంలో మగవారికి దీటుగా మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని వారు అన్నారు. మహిళ సాధికారతే లక్ష్యంగా వారు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది ఆశా వర్కర్లు డ్వాక్రా మహిళలు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినిలు కార్యక్రమంలోఅధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉత్తమ అంగన్వాడీ టీచర్‌గా ప్రభావతి



**ముద్దనూరు,మేజర్‌న్యూస్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, ముద్దనూరు1 అంగన్వాడి టీచర్‌గా ఉన్న ప్రభావతిని ఉత్తమ అంగన్వాడీ టీచర్ జిల్లా అధికారులు జ్ఞాపికను అందించి, సత్కరించడం జరిగిందని ముద్దనూరు తాసిల్దార్ వరద కిషోర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అలాగే ముద్దనూరు ఎంపీడీవో ముకుంద రెడ్డి, ముద్దనూరు ఐసిడిఎస్, సిడిపిఓ ముంతాజ్ బేగంలు వర్షం వ్యక్తం చేశారు.

## వైభవంగా నరసింహ స్వామికి పూజాభిషేకాలు



**బద్వేల్, మేజర్‌న్యూస్:** బద్వేలు నియోజకవర్గం వల్లేరవారి పల్లె గ్రామంలో వెలిసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు ఫాల్గుణ మాసం ఆరంభంతో రెండవ శనివారం స్వామివారికి అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజభిషేకాలు నిర్వహించారు. వీడియో కాల్ ద్వారా స్వామి కార్యక్రమాన్ని దేశ విదేశాలలో ఉన్న భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులు మాట్లాడుతూ స్వామి వారిని దర్శించుకోవడం వలన దీర్ఘ కాలిక వ్యాధులు తొలిగిపోతు ఉన్నాయి అని, ఆలయం లో అంత కూడా గోవింద నామముతో, స్వామిని స్మరిస్తూ ఉండటం వలన ప్రశాంతత మనశాంతి ఉంటుంది అని తెలియజేశారు, స్వామివారిని దర్శించుట కొరకు ఇతర గ్రామాల నుంచి కాక జిల్లా నలుమూల నుంచి వచ్చి స్వామి వారిని దర్శించుకుని వారి కోర్కెలు నెరవేరిన తర్వాత ముక్కులను తీర్చుకుంటున్నారు,అందులో భాగంగా మణ్యం.రవీంద్రారెడ్డి ధర్మపత్ని పద్మావతి గార్లు స్వామి వారికి వెండి తీర్థం గిన్నెను స్వామివారికి కైంకర్యం చేయడం జరిగినది,అన్నదాన కైంకర్యం నిర్వహించిన వారు నల్లబోతుల వెంకటసుబ్బయ్య ధర్మపత్ని శైలజ గార్లు ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ ప్రజలు పెద్దలు పాల్గొనడం జరిగినది.

## మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు




**కడప,మేజర్‌న్యూస్:** జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి శ్రీదేవి కోర్ట్ ఆవరణలోని న్యాయ సేవా సదన్ లో శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీదేవి మాట్లాడుతూ 1975 లో ఐక్యరాజ్యసమితి మహిళా దినోత్సవమును గుర్తించినది, 1996 నుండి మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. మహిళా దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యము మహిళల హక్కులు మరియు లింగ సమానత్వం గురించి అవగాహన పెంచడం, వివిధ రంగాలలో మహిళల యొక్క విజయాలు, మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు, సమాజంలో మహిళల పట్ల వివక్షత, లింగ నిష్పత్తిపై అవగాహన, కుటుంబంలో మహిళ పాత్ర, వివాహ వయస్సు మొదలగు విషయాలను వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, గౌరవ నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.దినబాబు, గౌరవ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, గౌరవ సీనియర్ సివిల్ జడ్జ్ కే.ప్రత్యూష కుమారి, గౌరవ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి జిసి.ఆసిఫా సుల్తానా, గౌరవ ఎక్సైజ్ కోర్టు జడ్జ్ జె.హేమ స్రవంతి, మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం.ఆశాప్రియ, కడప బార్ అసోసియేషన్ బార్ ప్రెసిడెంట జి. గుర్రప్ప, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు, మహిళలు, పారా లీగల్ వాలంటరీలు, పానెల్ న్యాయవాదులు, ప్రజలు పాల్గొన్నారు.

## జ్యోతి క్షేత్రం పై రాజకీయం తగదు



**కాశినాయన, మేజర్ న్యూస్:** కాశి నాయన. వరికుంట్ల గ్రామం సమీపాన జ్యోతిషంపై కపట ప్రేమను కురిపిస్తూ కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతూ నీచమైన రాజకీయాలు చేస్తూ కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం డిసి గోవింద్ రెడ్డి తగదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. డిసి గోవింద్ రెడ్డి గడిచిన 20 సంవత్సరాల నుండి నేటి వరకు మీరు ప్రజా ప్రతినిధులుగా ఉన్నారు. మీరు శాసనమండలిలో మాట్లాడే అవకాశం ఉన్న కూడా ఏ రోజు అయినా ఎక్కడైనా మీరు శ్రీ అవధూత కాశిరెడ్డి నాయన గురించి గానీ జ్యోతి క్షేత్రం గురించి గానీ అభివృద్ధి గురించి గానీ జ్యోతి క్షేత్రం గురించి మీ పాత్ర ఏమి ఉన్నదో మీరు ఆత్మ పరిశీలన చేసుకో వాలన్నారు. మీ సొంత గ్రామంలో అయినటువంటి వరికుంట్లలో కాశినాయన గారి ముఖద్వారం కట్టకుండా ఆపుతుంటే మీరు ఏమైనా గ్రామ ప్రజలను ఒప్పించి నిర్మాణానికి చర్యలు చేపట్టారా. కూటమి ప్రభుత్వంపై మీరు చేస్తున్నటువంటి ఆరోపణలు అవాస్తవమని ప్రజలందరూ గమనిస్తు న్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షుడు బంగారు గురువు రెడ్డి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రాజారెడ్డి, దుగ్గిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సుధాకర్ రెడ్డి, రోహిత్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ




**బద్వేల్, మేజర్‌న్యూస్ :** కడప జిల్లాలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో ముఖ్యఅతిథిగాపాల్గొని జిల్లా ఇంచార్జి మంత్రి సవిత జిల్లా పర్యటనలో భాగంగా విచ్చేసిన మంత్రిని కలిసి శాలవాతోసత్కరించి పూలకుండని అందజేశారు అనంతరం శుభాకాంక్షలు తెలిపి టీడీపీ బద్వేల్ మాజీ ఎమ్మెల్యేవిజయమ్మ 33వ వార్డు కౌన్సిలర్ మిత్తికాయల సునీత తదితరులు పాల్గొని రామగు శుభాకాంక్షలు తెలిపారు అనంతరం జిల్లాలో ఏర్పాటుచేసినమహిళల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే మహిళా దినోత్సవ లక్ష్యం

### ఏపిసిసి అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి



వేంపల్లె మేజర్ న్యూస్:మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత సాధించడమే అంతర్జాతీయ మహిళా దినోత్సవ లక్ష్యమని ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం ఆ దినోత్సవాన్ని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివమునెమ్మ, ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వర్ణలత లను శాలువతో సత్కరించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ భగవంతున్ని సృష్టిలో స్త్రీ, పురుషులు సమానమన్నారు. కానీ పరిణామ క్రమంలో స్త్రీల పట్ల వివక్ష ఎక్కువైందన్నారు. మాతృగర్భం నుండి కాలగర్భంలో కలిసిపోయే వరకు వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. ఆడ శిశువుల భ్రూణహత్యలు, స్త్రీలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. వీటిని రూపు మాప డమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం లక్ష్యమన్నారు. కాంగ్రెస్ మొదటి నుంచి మహిళా సాధికారతకు కృషి చేస్తుందన్నారు. విద్యా, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, డ్వాక్రా సంఘాలు, ఐసీడీఎస్ లను స్థాపించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం, మహాశక్తి, డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షల మేర సున్నావడ్డీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరారు. తులసిరెడ్డి సతిమణి అలివేలమ్మ, నాయ కులు సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్, ఉత్తన్న, రాజా, బద్రి పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

### మండల విద్యాశాఖ అధికారి ప్రేమ సాగర్



కలసపాడు మేజర్‌న్యూస్: నేటి పరిస్థితులలో మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని మండల విద్యాశాఖ అధికారులు, ప్రేమ సాగర్ , మస్తాన్ వలీ పిలుపు నిచ్చారు. శనివారం మండల కేంద్రమైన కలస పాడు లోని ఎమ్‌పిపీ ఉర్దూ పాఠశాలలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించి కొని సమ సమాజంలో మహిళలు సామాజిక ఆర్థిక, విద్యా, రాజకీయ రంగంలో ఉన్నత స్థానం సాధించడానికి గ్రామ స్థాయిలో యువత పాత్ర కీలక మైందన్నారు. ఉన్నత ఆశయాలతో విద్యనభ్యసించి సమ సమాజంలో ఉన్నత స్థానాన్ని పొందాలని, మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే విద్యా రంగంలో ఉన్నత స్థానం పొందాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యస్ గుల్జార్ బేగంను మండల విద్యా శాఖాధికారులు శాలువా పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల ఉపాధ్యా యులు ఎం బాలరాజు నాయక్ రాజారెడ్డి విద్యార్థులు జీవన్ కుమార్ ఎంఆర్ సిఐఈఆర్‌టి నాన్ టీచింగ్ సిబ్బంది ఎస్‌ఎంసి సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్ని రంగాలలో పురుషులతో సమానంగా

### ఎంపీడీవో వెంకటరమణయ్య




యర్రగుంట్ల మేజర్ న్యూస్ శనివారం మండల పరిధిలోని కలమల్ల -1 గ్రామంలోని సచివాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో వెంకట రమణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీపడుతూ ముందుకు సాగుతున్నారని వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు ఎందులోనూ తక్కువ లేరని, అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. చిలమకూరు పీహెచ్సీ డాక్టరు సాయిచరిత మాట్లాడుతు ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తున్న మహిళలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలని, ఆమె అన్నారు. ముఖ్యంగా వైద్యరంగంలో అన్ని విభాగాల్లో మహిళలు నైపుణ్యాలను ప్రదర్శించడంతో పాటు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించే స్థాయికి చేరుకున్నారని కొనియాడారు .అదే స్థాయిలో సేవలు అందిస్తున్నారని తెలిపారు భవిష్యత్తులో పురుషులకు పోటీగా నిలవడానికి మహిళలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హేఫీబా, ఉప మండల అధ్యక్షులు పొన్నా శ్రీనివాసులు, ఏ పీ ఓ జగదీశ్వరి రంతులయ్య, వార్డు సభ్యులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## వృద్ధులకు టవాళ్లు, దుప్పట్లు పంపిణీ

లింగాల మేజర్ న్యూస్ ప్రతి మనిషిలోను సేవా దృక్పథం అలవర్చుకుని ఏదో ఒక రూపంలో సేవలు అందించే విధంగా ప్రతి ఒక్కరు బాధ్యత వ్యవహరించినప్పుడే సేవ చేసేటువంటి వాటిపై పరమార్ధాన్ని భగవంతుడు కూడా ఆశీర్వదిస్తారని పులివెందుల లోని శ్రీ విద్యాధరి పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం పులివెందుల పట్టణమునకు చెందిన స్థానిక విద్యాదరి పాఠశాల నందు 8 వ తరగతి చదువుచున్న విద్యార్థినీ విద్యార్థులు లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపాన ఉన్న వృద్ధాశ్రమం లోని వృద్ధులకు తమవంతు సహాయం గా సేవాదృక్పథంతో శనివారం నాడు పాఠశాల సిఈఓ భాను ప్రకాష్ పాఠశాల కరస్పాండెంట్ నాగరాజు ప్రధాన అధ్యాపకులు జకీరా? ఉపాధ్యాయ ఉపాధ్యాయునిలు టవళ్ళు దుప్పట్లు అందచేసారు . అందుకు ఆశ్రమం వారు కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వాసులు పాల్గొన్నారు

# మహిళలు సమాజానికి స్ఫూర్తి, శక్తి

### మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన చైర్మన్-వైస్ చైర్మన్ -కన్వీనర్





పులివెందుల మేజర్ న్యూస్ పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో శనివారం మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పులివెందులలోని వైద్య బృందం మహిళలను మెప్మా డ్వాక్రా మహిళలను సత్కరించాలన్న సంకల్పంలో భాగంగా మహిళలు సమాజానికి స్ఫూర్తి శక్తి అని స్త్రీ లేక పోతే ఈ జగమే శూన్యమని మహిళలకు పసుపు కుంకుమ చీర అందించి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆహ్వానం మేరకు పులివెందులలోని డాక్టర్ శరణ్య డాక్టర్ జ్యోతి డాక్టర్ గంగాదేవి, ఇతర వైద్య బృందం మెప్మా సిఓ నాగలక్ష్మి, డ్వాక్రా ఆర్పీలను పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అనంతరం వైద్య బృందం వారు మాట్లాడుతూ మహిళ దినోత్సవం అంటే కుటుంబ మంతా జరుపుకోవాల్సిన పండుగ, మహిళ లేని జీవితాన్ని ఏ పురుషుడు ఊహించలేడు, తల్లిగా సోదరిగా భార్యగా అత్తగా అమ్మమ్మగా నాయనమ్మగా జీవితమంతా మగాడిని వెన్నంటి వుండే స్త్రీ మూర్తి కుటుం బానికి చేసే సేవ అమూల్యం వేటితో పోల్చ లేనిది, గర్భ ధారణ అనే వరాన్ని ఆ దేవుడు కేవలం మహిళలకు మాత్రమే ప్రసాదించాడు, సృష్టికి మూల మైన స్త్రీ పురుషులను స్త్రీమాత్రమే కన గలదు, లిస్త్రీ స్త్రీ పురుషుడు అనే భేదం లేకుండా ఇద్దరిని సమానంగా ప్రేమ అనురాగా లతో ఓర్పు సహనం నేర్పుతో పెంచడం కేవలం స్త్రీ మూర్తికే చెల్లింది,అందుకు ఒకప్పుడు స్త్రీని అబలగా చూసే వారునేటి మాహిళ అబల కాదు సబల అని నిరూపించడంతో పాటు పురుషుతో సమానంగా ఆ మాటకొస్తే ఇంకా ఎక్కువగానే చదువుకుని సాఫ్ట్వేర్ హార్డ్వేర్ అనే భేధం లేకుండా అన్ని రకాల వుద్యోగాలు చేస్తున్నారు. ఒకప్పుడు కేవలం పురు షులు మాత్రమే చేసే కఠినమైన అధిక శ్రమతో కూడిన ఉద్యోగాలు పోలీసు ఆర్మీ పైలట్ లాంటివి కూడా అవలీలగా చేసేస్తున్నారు దేశ అధ్యక్షులుగా ప్రధానులుగా మంత్రులుగా రానిస్తున్నారు చట్ట సభల్లో ప్రతినిధ్యం వహిస్తున్నారు. కేవలం గుర్తింపు కోసమే స్త్రీ పురుషుడు అని చెప్పాలి తప్ప అన్ని విషయాల్లో ఇద్దరు సమానమే. మహాళలను కించ పరచడం తక్కువగా చూడడం మాని ఆమెకు తగిన గౌరవాన్ని ఇచ్చి ఆమె స్వేచ్ఛకు భంగం కలగ కుండా ప్రతి పురుషుడు నడుచుకోవాలని కోరుతూ. మహిళలు అందరూ తమ జీవితాల్లో ఇంకా బాగా ఎదదగాలని తెలియ జేశారు కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, రెండవ వైస్ చైర్మన్ హాఫీజ్, పులివెందుల పట్టణ వైకాపా కన్వీనర్ హాల్ గంగా ధర్ రెడ్డి, మెప్మా సిబ్బంది డ్వాక్రా ఆర్పీలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కడప జిల్లా అధ్యక్షులుగా పాతూరి చెన్నయ్య



జమ్మలమడుగు మేజర్ న్యూస్: పోలీస్ మిత్ర క్రైమ్ కంట్రోల్ మరియు ఇంటర్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజషన్ కడప జిల్లా అధ్యక్షులుగా పాతూరి చెన్నయ్య నియమించిన జాతీయ నాయకులు తాహిర్ జాఫ్రి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకులు సయ్యద్ ముస్ట్ పీర్ ఖాద్రి. కడప జిల్లా అధ్యక్షులుగా నియమిచ్చినందుకు ధన్యవాదములు అని చెన్నయ్య తెలిపారు. సంఘము నియమాలు కట్టుబడి ఉంటానని మానవ హక్కులు కాపాడతాను అని కడప జిల్లా ప్రజలు అందుబాటులో ఉంటాను అని తెలిపారు. కడప జిల్లా అధ్యక్షులుగా తనను ఎన్నుకుందుకు ఆనందంగా ఉందని చెన్నయ్య తెలిపారు.

## మహిళ దినోత్సవ వేడుకల్లో మాజీ ఆప్కాస్ స్టేట్ బోర్డ్ డైరెక్టర్

పోరుమామిళ్ల మేజర్ న్యూస్ డాక్టర్ ఎస్.వి.వి. ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల పట్టణంలోని లిటిల్ ఏంజెల్ స్కూల్ నందు శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రముఖ సర్జన్ ఎస్. కళ్యాణ చక్రవర్తి, డాక్టర్ మృదుల నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్మిక ఉద్యమం నుండి పుట్టుకొచ్చిందని, దీనిని ఐక్యరాజ్యసమితి 1980వ సంవత్సరంలో గుర్తించి నిర్వహించడం జరిగిందన్నారు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం అసలు లేదన్నారు. ఇంట్లోనూ వృత్తిలోనూ రాజకీయాలలో ఒకప్పుడు వెనుకబాటు తనం ఉండేదని ప్రస్తుతం అన్ని రంగాలలో మగవారికి సమానంగా మహిళలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. అనంతరం డాక్టర్ మృదుల, ఓఎల్‌ఎఫ్ సిస్టర్ జసింత, ఎస్బిఐ అసిస్టెంట్ మేనేజర్ సుప్రజా, వివేకానంద ఆశ్రమం నిర్వాహకురాలు రామ తులసి, తిమ్మారెడ్డిపల్లి సర్పంచ్ ఉమామహేశ్వరి లను ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లిటిల్ ఏంజెల్ కరెస్పాండెంట్ రంగాచారి, ఉపాధ్యాయులు ప్రసాద్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# సృష్టిలో స్త్రీ శక్తి అనంతం

## మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్

# స్త్రీ లేనిదే మానవాళి మనుగడ సాగదు

## వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నప్ప



పులివెందుల మేజర్ న్యూస్ పులివెందుల పట్టణం లోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాలు గా ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం కి ఏర్పాటు చేసిన ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం లోని మహిళా ఉపాధ్యాయనీలకు మరియు ఉపాధ్యాయుల సతీమణులకు అభినందన కార్యక్రమం లో మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నప్ప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు ల చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నప్ప లు మాట్లాడుతూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం అందిస్తున్న గ్రామీణ, పట్టణ ప్రాంత పేద విద్యార్థుల కొరకు అహర్నిశలు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ సృష్టి లో స్త్రీ శక్తి అనంతం అని, స్త్రీ లేనిదే ఈ సృష్టి లో మానవాలి మనుగడ సాగదని, అలాంటి స్త్రీల ఋణం ఎన్నటికీ తీర్చుకోలేనిది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం వెంకటనారాయణ, రామక్రిష్ణయ్య, మహేశ్వర్ రెడ్డి, సుబ్బిరెడ్డి దంపతులు మరియు ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం లోని మహిళా ఉపాధ్యాయనీలు డాక్టర్ శేష మహేశ్వరమ్మ,శ్రీదేవి, సేవాసమితి కార్యదర్శి సునీత, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్,సభ్యులు చాంద్ బాషా, ఉర్దూ అకాడమీ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# 12న యువత పోరుకు యువత తరలి రండి!

## వైసీపీ జిల్లా నేతల పిలుపు



కడప - మేజర్ న్యూస్ ఈనెల 12న వైసీపీ చేపట్టిన యువత పోరుకు యువత పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజాద్ భాషా పిలుపునిచ్చారు. శనివారం కడప నగరంలోని జిల్లా వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్.బి.అంజాద్ భాషా తోపాటు జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, కడప నగర మేయర్ కే.సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.బి. అంజాద్ భాషా మాట్లాడుతూ...12 వ తేది వైఎస్ఆర్సీపీ చేపట్టిన యువత పోరు కు యువత తరలిరావాలని కోరారు. అదే రోజు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించి యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తాం. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అన్నారు.. ఇప్పటికీ ఒక్క హామీని నెరవేర్చలేదు. మహిళలకి పెద్ద పీట వేసిన ఘనత వైఎస్ జగన్ ది. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలు పూర్తి స్థాయిలో అన్యాయం జరుగుతోంది. మహిళలకు ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరికీ నెలకు 1500 ఇస్తామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం అన్నారు.. ఏం అయింది ఆ హామీ?, ఎన్నికలు వస్తే చంద్ర బాబుకు అందరూ గుర్తు వస్తారు. ఎన్నికలు అయ్యాక అందరినీ విస్మరిస్తారు.. అందరికీ వెన్నుపోటు పొడుస్తారు. కూటమి ప్రభుత్వ మోసాలు ప్రజలు వాస్తవాలు గ్రహిస్తున్నారు. జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. 12 న వైఎస్సార్సీపీ యువత పోరు జయప్రదం చేయండి. వైఎస్ఆర్సీపీ కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ నిరసన ప్రదర్శన. కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి కలెక్టర్ కు వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో యువతకు తీరని అన్యాయం చేస్తున్నారు. ఎన్నికల్లో యువతకు ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదు. గ్రామ వార్డు వాలంటీర్లకు తీరని మోసం, అన్యాయం చేశారు. అన్ని రంగాల్లో ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారు. చివరకు వృద్ధులను సైతం వదలకుండా 10 లక్షల ఫింఛన్లు తొలగించారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లో ప్రతి ఒకరికి సమన్యాయం చేసిన ఘనత జగన్ ది. మహిళలకు భద్రత తో పాటు రక్షణ గా దిశ యాప్ నిలిచింది. వేలాది మంది మహిళలను ఆపద సమయంలో యాప్ ద్వారా సురక్షితంగా కాపాడటం జరిగింది. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం లేదు. ప్రజలను దోచుకోవడానికి, ఖనిజాన్ని దండుకోవడానికి ఉంది. ప్రతిపక్ష నాయకుల పై అక్రమ కేసులు పెట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య యాదవ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దేవి రెడ్డి ఆదిత్య, జిల్లా విద్యార్థి విభాగమ అధ్యక్షుడు గురు సాయిదత్త, జిల్లా అధికార ప్రతినిధి జయచంద్ర రెడ్డి, నగర విద్యార్థి విభాగం అధ్యక్షుడు శివారెడ్డి పాల్గొన్నారు.

# గోపవరం మండల సమైక్య భవన్‌లో అంతర జాతీయ మహిళా దినోత్సవం

గోపవరం మేజర్ న్యూస్ ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి మండల సమైక్య ఏపిఎం ప్రకాష్ గారు మాట్లాడుత మహిళల కోసం ప్రపంచంలో ఎందరో మహిళలు వారి హక్కుల కోసం ప్రాణ త్యాగాలు చేసి ఈనాడు అన్ని రంగాలలో మహిళలు పురుషులతో సమానంగా పనిచేస్తున్నారు. కావున సమాజంలో మహిళలు భయపడవకుండా నిర్భయంగా తమ హక్కుల కోసం పోరాడాలని తెలియజేశారు.. ఝాన్సీ లక్ష్మీబాయి జ్యోతి పూలే అనిబిసెంట్ దుర్గాబాయి దేశ్ముఖ లాంటి మహిళలు ఆనాడే కోసం మహిళల సమానత్వం కోసం ఎన్నో త్యాగాలు చేశారు వారి కృషి ఫలితంగానే మనం ఈరోజు సమాజంలో ఉన్నత స్థానానికి చేరిస్తున్నాము సమాజంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నాము అని అన్నారు



# మహిళ సాధికారతతోనే సమాజాభివృద్ధి

## బద్వేల్ ఎమ్మెల్యే డా.సుధా, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ








పోరుమామిళ్ల మేజర్ న్యూస్ మహిళా సాధికారతతోనే సమాజం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ,మాజీ ఎమ్మెల్యే పి.ఎం.కమలమ్మ పేర్కొన్నారు. శనివారం ఎస్టీయు కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో పోరుమామిళ్లలోని ఎస్టీయు భవన్ నందు జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ పి.జె.పి. కవిత అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే సుధ, మాజీ ఎమ్మెల్యే కమలమ్మలు మాట్లాడుతూ అనాదిగా మహిళలు ఆంక్షలు, కట్టుబాట్లు, మూఢ నమ్మకాలను తట్టుకుని అవని నుండి అంతరిక్షం దాకా ఎదిగారని,ప్రతి రంగంలో మహిళలు పురుషులకు ధీటుగా రాణిస్తున్నారు అని తెలియచేస్తూ, చట్టాలు ఎన్ని ఉన్నా మహిళల మీద అకృత్యాలు మాత్రం ఆగడం లేదన్నారు.ఇంకా రోజుకు ఒక ఫోక్సో కేసు నమోదు కావడం ఆందోళనకరమైన అంశం అని, పనిచేసే చోట మహిళలకు రక్షణ కల్పించాలంటే చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలని, చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. మార్పు పాఠశాల స్థాయి నుండి మొదలు కావాలని అందుకు ఉపాధ్యాయులు తమవంతు బాధ్యత నెరవేర్చాలని వారు ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఎస్టీయు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎన్.డి.విజయ జ్యోతి,కాశినాయన ఎంఇవో నిర్మల మాట్లాడుతూ చంద్రునిపైకి మనిషి అడుగుపెడుతున్న నేటి కాలంలో కూడా ఇంకనూ కొంతమంది మహిళలు రాజకీయాలలో వివక్షతకు గురవుతున్నారన్నారు. రాజకీయాలలో మహిళలు మరింత రాణించేలా ప్రభుత్వాలు చొరవచూపాలన్నారు. నవ సమాజం నిర్మితమవాలంటే మహిళలతోనే సాధ్యమన్నారు. ఉద్యోగులుగా మహిళలు చేస్తున్న సేవలు అనిర్వచనీయ మన్నారు.ఈ కార్యక్రమంలో బి.కోడూరు ఎంపీపి చెన్నమ్మ,పోరుమామిళ్ల మాజీ జడ్పీటిసి శారదమ్మ, మాజీ ఎంపిపి ఈశ్వరమ్మ,ఎంపిటిసి పుష్పలత,టేకూరుపేట వైద్యురాలు, వివేకానంద సేవాశ్రమం నిర్వాహకురాలు రామతులసి, ఆగ్నేసమ్మ ఆసరా ఫౌండేషన్ నిర్వాహకులు, అంగన్వాడీ వర్కర్లు, మహిళా పోలీసులు, సీఆర్టీలు, గ్రామసచివాలయ ఉద్యోగులు, పంచాయితీ పారిశుధ్య కార్మికులందరినీ శాలువా, పూలమాలలు,బహుమతులతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఇలియాస్ భాషా,సంగమేశ్వర రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణారెడ్డి, బాలగంగిరెడ్డి,జిల్లా ఆర్థిక కార్యదర్శి రామమోహన్, రాష్ట్ర సిపియస్ కమిటీ కన్వీనర్ సుబ్రమణ్యం,రాష్ట్రకౌన్సిలర్ చంద్రహాసరెడ్డి, రీజనల్ కన్వీనర్ వి.వి.క్రిష్ణారెడ్డి,కోకన్వీనర్ రమణ,జిల్లామహిళాకమిటీ కోకన్వీనర్ సౌజన్య, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆర్ అండ్ ఏసి టెక్నీషియన్స్ సమస్యలను పరిష్కరించాలి

## 'రాక్వా' కడప నగర అధ్యక్షుడు లెక్కల మురళీమోహన్ రెడ్డి




కడప మేజర్ న్యూస్ రిఫ్రిజిరేషన్ టెక్నిషన్ కార్మికుల సమస్యలపైన, వారు పడుతున్న ఇబ్బందుల గురించి కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడం సంతోషమని రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ (రాక్వా) కడప నగర అధ్యక్షుడు లెక్కల మురళీమోహన్ రెడ్డి అన్నారు. శనివారం కడప లో విలేకరులతో మాట్లాడుతూ ఆర్ అండ్ ఏసి టెక్నీషియన్స్ కు లేబర్ డిపార్ట్మెంట్ లోని భవన నిర్మాణ కార్మికుల దాంట్లో ప్రత్యేక విభాగం కావాలని కోరారు. ఏడాదిలో కేవలం నాలుగు నెలలు మాత్రమే సీజన్ ఉంటుందని, మిగిలిన కాలంలో పనులు లేక ఆర్ అండ్ ఏసి టెక్నీషియన్స్ ఇబ్బందులు పడుతున్నారని బాధను వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది, కడపలో వెయ్యి మంది టెక్నీషియన్స్ ఉన్నారని వెల్లడించారు. ఆర్ అండ్ ఏసి టెక్నీషియన్స్ సమస్యల గురించి మంత్రులకు ఎమ్మెల్యేలకు వినతిపత్రం కూడా ఇవ్వడం జరిగిందన్నారు వారు సానుకూలంగా స్పందించారని చెప్పారు.శుక్రవారం అసెంబ్లీలో కడప ఎమ్మెల్యే మాధవరెడ్డి అసెంబ్లీలో టెక్నీషియన్స్ సమస్యల గురించి చర్చించడంపై ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం లో రాక్వా సెక్రటరీ అక్రమ్ రషీద్, ట్రెజరర్ సయ్యద్ మైనుద్దీన్, కమిటీ మెంబర్స్ అశ్విన్, ప్రభాకర్ రెడ్డి, షరీఫ్, రాఘవ, సుబ్బు, ఆరిఫ్, మునవర్, రహమతుల్లా పాల్గొన్నారు.

# ఎక్కడా లేని నిబంధనలు కాశినాయన క్షేత్రంలో ఎందుకు?

## మిగతా ప్రాంతాల్లో అటవీ ప్రాంతాన్ని ఆక్రమించుకుంటున్న చర్యలేవి?

## రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి ఉపాధ్యక్షులు వెంకట సర్వోత్తమ్‌రెడ్డి



పులివెందుల మేజర్ న్యూస్ జ్యోతి క్షేత్రంలో కాశిరెడ్డి నాయన ఆశ్రమ వసతి గృహాలను పడగొడుతున్న కూటమి ప్రభుత్వం పనిచేయడానికి శక్తి లేక, ప్రజలకు మేలు చేసే పనిచేయ లేక, ప్రజలకు కీడు చేయుటకు సంకల్పించిందని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఈ సందర్భంగా పత్రికా ముఖంగా తెలియజేస్తూ కాశిరెడ్డి నాయన జ్యోతి ఆశ్రమం చివరిరోజుల్లో కన్న బిడ్డలు కూడు పెట్టకపోతే, ఆసరా ఇవ్వడానికి కాశినాయన ఉన్నాడనే ముసలోళ్ల నమ్మకాన్ని పడగొట్టారని, ఆకలంటూ వెళ్లిన వాడికి లేదనకుండా కుడుపునింపుతున్న దాతృత్వాన్ని పడగొట్టారని, ఎంత మంది వచ్చారు, ఎన్నాళ్లుంటారు, మీ కులమేంటి, గోత్రమేంటి, మతమేంటి, ప్రాంతమేంటి, అనే పట్టింపు లేకుండా జరిగే నిత్యాన్నదానాన్ని పడగొట్టారన్నారు. అదేంటి ఆశ్రమం పేరిట అడవిని ఆక్రమిస్తే ఎలా..?అదసలే టైగర్ జోన్ అంటారేమోనని, ఎక్కడ లేదు అడవి..! ఎక్కడ లేదు రిజర్వ్ ఫారెస్ట్..దేశంలో ఎంతోమంది రాజకీయ నాయకుల చేతులలో ఎంతో అడవి భూమిని ఆక్రమించారని, వారందరిన మీద ఎటువంటి యాక్షన్లు లేకుండా దేవుడి దగ్గర ఎంతోమంది సేద తీరుతున్నా అనాధలైన వారు వారి జీవన భృతి జరుగుతున్నది. అటువంటి చోట మీ ప్రతాపము చూపించకండని హితవు పలికారు. పోరుమామిళ్ల నుంచి జ్యోతి(కాశినాయన ఆశ్రమం) వెళ్లే ఆర్టీసీ బస్సులను అడవిలోకి అడుగుపెట్టనివ్వకుండా చివరి పల్లె అయిన వరికుంట్ల గ్రామం దగ్గరే ఆపి అటునుంచి అటే వెనక్కి పంపిస్తున్నారని, సామాన్య ప్రయాణీకులు, భక్తులు అక్కడినుంచి ఆటోలు తీసుకుని జ్యోతి వెళ్లాల్సి ఉంటుందని, అక్కడి పరిస్థితి అంత దారుణంగా ఉందన్నారు. అడవి మధ్యలో ఉన్న గుడుల్లో, చర్చిలలో అక్కడెక్కడా లేని నిబంధనలు, కఠిన చర్యలు నల్లమల టైగర్ జోన్ దక్షిణపు అంచున, తూర్పు కొసన కాశినాయన మీద మాత్రమే ఎందుకు అని ప్రశ్నించారు. నిత్యాన్నదానం పేరిట వచ్చిన భక్తుల్ని చందాలు, విరాలాల పేరిట దోచుకుతింటున్నారా..! లేదే. రైతులకై రైతులే స్వచ్ఛందంగా నడుపుకునే ఆశ్రమమదని, మరీ ఇబ్బందిగా ఉంటే ఆశ్రమ నిర్వహకులు ఊరూరు తిరిగి స్వచ్ఛందంగా ధాన్యం సేకరించి మరీ అన్న సత్రం నిర్వహిస్తుంటారన్నారు. అడవి గొప్పదే, సృష్టిలో ప్రతి జీవీ ప్రత్యేకమైనదే, మనిషిగా వన్యప్రాణులకు మనమివ్వాల్సిన సమతుల్యత, రక్షణ ఖచ్చితంగా ఇవ్వాలని, కానీ ఎక్కడా లేనట్టు, ఇక్కడే ఎందుకింత నిర్భంద చర్యలు అని పేర్కొన్నారు. నిజంగా ఫారెస్ట్ అధికారులు ఈ సమస్యను శాంతియుతంగా పరిష్కరించదలచుకుంటే కులానికో వసతి గృహం, గోత్రానికో అన్నసత్రం అంటూ పరిధికి మించిన కట్టడాలను కూల్చివేసి, కొత్తవి కట్టకుండా నిత్యాన్నదాన సత్రాన్ని, ఆశ్రమాన్ని, కాశినాయన గుడిని నడిపించుకునేలా ఒక పరిధిని నిర్ణయించి మధ్యే మార్గంగా చూసుకోవడం ఉత్తమమన్నారు. దేశం మొత్తం సనాతన ధర్మ స్థాపనకు పూనుకున్న కాషాయ పార్టీ, ఆధ్యాత్మిక యాత్రల పేరతో సనాతన ధర్మోద్ధారణకు కంకణం కట్టిన పార్టీలకు ఈ చర్యలు కనపడకపోవడం శోచనీయం. అటవీ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ ఉండటం, హిందువుల మనోభావాలు అస్సలు దెబ్బతినకపోవడం, ఈ వార్త అసలు బయటికి రాకపోవడం మరింత ఆశ్చర్యకరం. మీరు కాశిరెడ్డి నాయన ఆశ్రమాన్ని జ్యోతి ఆశ్రమం భక్తులకు ఇబ్బంది కలిగిస్తూ ఉంటే ఇలా గుళ్ళు గోపురాలు పడగొడుతూ ఉంటే బిజెపి మరియు ఎప్పుడూ ఏదో ఒక మాల ధరిస్తున్న సనాతన ధర్మ నేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి మరియు విశ్వహిందూ పరిషత్ వాళ్లకు బజరంగ్దళ్ వాళ్లకు హిందూ ధర్మ రక్షణ సేవ వాళ్లకు ఇది కనపడడం లేదా దయచేసి ప్రతి ఒక్క హిందువు ఐక్యంగా ఉండి ఇలాంటి చర్యలను ఎదుర్కొన్నాము. ఇప్పుడున్న ఈ ప్రభుత్వాలు ఇలాంటి చర్యలు మానుకోకపోతే గందరగోళమైన పరిస్థితిని ఎదుర్కొంటుంది . అన్నా క్యాంటీన్ ల పేరుతో ప్రతి ఒక్కరి దగ్గర ఐదు రూపాయలు వసూలు చేస్తూ ప్రభుత్వం ?90 రూపాయలు ఖర్చు చేస్తున్నారు భక్తుల దగ్గర ఒక రూపాయి కూడా తీసుకోకుండా నిత్యాన దానం చేస్తున్నారు ఆశ్రమాలపై చర్యలు ఆపకపోతే హిందువులందరూ ఒక్కటై ప్రభుత్వాలకు తగిన విధంగా బుద్ధి చెప్పాల్సి వస్తుంది అని యర్రపు రెడ్డి సురేంద్రరెడ్డి వెంకట సర్వోత్తమ్ రెడ్డి తెలపడం జరిగింది

# మదర్‌థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



**పోరుమామిళ్ల మేజర్ న్యూస్:**రంగసముద్రం పంచాయతీ పరిధిలోని మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లెస్డ్ బ్రయాన్ అనాధాశ్రమంలో సంస్థ ప్రతినిధులు ఆదూరి ఆరోగ్య రాణి రెడ్డి, రోజులీనారెడ్డి డాక్టర్ అమితారెడ్డి, డాక్టర్ మౌనిక రెడ్డి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బద్వేల్ నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ సుధ ను సత్కరించి కార్యక్రమంలో ఆటల్లో పాల్గొని బహుమతులు గెలిచిన మహిళలందరికీ బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఇప్పుడు అన్ని రంగాలలో చురుగ్గా ముందుగా ఉన్నారని ఇంటి పట్టునే ఉండటమే కాకుండా ఇంటిని చక్కబెడుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితికి తోడ్పడుతూ అనేక రంగాల్లో ముందంజలో ఉండాలని మహిళలందరికీ సూచించారు. మహిళా దినోత్సవం గుర్తు చేసుకుంటూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటలు పెట్టి అందర్నీ ఉత్తేజపరుస్తున్నం దుకు చైర్మన్ చిత్తా రవిప్రకాష్ రెడ్డిని, చిత్త గిరి ప్రణీత్ రెడ్డిని, సంస్థ ప్రతినిధు లందరినీ అభినం దించారు. కార్యక్రమంలో మహిళలు ఆశ్రమ చిన్నారులు ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

## వాసవి క్లబ్ అధ్యక్షుడు వెంకట సుబ్రహ్మణ్యం




**కమలాపురం, మేజర్‌న్యూస్:** మహిళలు అన్ని రంగాలలో రాణించినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని గ్రేటర్ శ్రీ వాసవి క్లబ్ అధ్యక్షుడు బొచ్చు వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్య ద్వారా మహిళలు తమ జీవితాన్ని మెరుగుపరుచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. విద్య అనేది ప్రతి మహిళకు సత్తా, గౌరవం, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అందించే శక్తివంతమైన ఆయుధమని తెలియజేశారు. మహిళా విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటూ సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక సహాయాన్ని అందజేసి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ గతంలో విజయాలు సాధించిన మహిళ నాయకుల గురించి చెప్పుకుంటారని తెలిపారు అలా కాకుండా ప్రస్తుత సమాజంలో ఎంత మంది మహిళలు నాయకులుగా ఎదిగారని, ప్రతి సంవత్సరం జరిగే మహిళా దినోత్సవం వేడుకల్లో చర్చ జరిగి బాగుంటుందని చెప్పారు. అదేవిధంగా మహిళలు ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడు గర్వపడకుండా కుటుంబంలోని తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ ఆ కుటుంబాన్ని సరైన మార్గంలో పయనించేందుకు చర్యలు తీసుకున్నప్పుడే మహిళలకు ప్రత్యేక స్థానం గుర్తింపు ఉంటుందని చెబుతూ ఈ దశగా విద్యార్థులు పయనించాలని పిలుపునిచ్చారు. మహిళలు కుటుంబ జీవితానికి మూలస్థంభాలని తెలిపారు. కావున సామాజిక అభివృద్ధికి గొప్ప సహకారం అందించే దిశగా ప్రతి మహిళ నడుం బిగించాలని తెలిపారు. మహిళలు శక్తివంతమైన నాయకత్వ లక్షణాలను కనబరచగలరని, కుటుంబ, ఉద్యోగ జీవితం మధ్య సమతుల్యతను సాధించగలరని వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కమలాపురం మహిళా పోలీస్ వారిని గౌరవించడం గ్రామపంచాయతీలో మహిళా స్లీపర్లను వేసవికాలం దాహార్తిని తీసుకునేందుకు వారికి వాటర్ బాటిల్స్ ను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సెక్రటరీ భోజన పాటి సుధాకర్ బాబు ట్రెజరర్ గాజుల పల్లె చంద్రశేఖర్ గుప్త. స్పీకర్ రెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు చాగలేటి భాస్కర్ గృహోపకరణాల వితరణ

## అవయవాలులేని దివ్యాంగుల పెన్షన్ తొలగించడం అన్యాయం

## వేముల మండల వైఎస్సార్సీపీ నాయకులు సాంబశివారెడ్డి



పులివెందుల అర్బన్ మేజర్ న్యూస్ వైఎస్ఆర్సిపి దివ్యాంగుల విభాగం పులివెందుల నియోజకవర్గం కన్వీనర్ గా నియమితులైన చాగలేటి భాస్కర్ అభినందనసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాగేళ్ల సాంబశివారెడ్డి, వ్యవసాయమార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్పతో కలిసి అంతర్జాతీయ మహిళాదినోత్సవ కేక్ కట్ చేసి దివ్యాంగులైన మహిళలకు అందించారు. అనంతరం చాగలేటి భాస్కర్ తనతోటిదివ్యాంగులకు ఈసందర్భంగా హాట్ బాక్సులు, కూల్ వాటర్ క్యాన్లు తదితర గృహోపకరణాలను వితరణగా నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. తదనం తరం భాస్కర్ నాగేళ్ల సాంబశివరెడ్డిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందించారు. తరువాత స్థానిక వికలాంగులసంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులు చాగలేటి భాస్కర్ కు ఘనసత్కారం చేశారు. ఈసందర్భంగా చాగలేటి భాస్కర్ మాట్లాడుతూ, అధికారంఉన్నా, లేకపోయినా, పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అవయవాలులేని దివ్యాంగుల న్యాయమైన సమస్యల పరిష్కారంకోసం తన వంతు రాజీలేని పోరాటం కొనసాగిస్తానని, తన అభ్యున్నతికి సహకరించిన తనగురువు సాంబశివారెడ్డి, వై ఎస్ ఆర్ సి పి అగ్రనాయకులు వైయస్ జగన్మోహన్ రెడ్డి, అవినాష్ రెడ్డి తదితరులకు జన్మజన్మల రుణపడి ఉంటానని వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వ్యవ సాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, చాగలేరు ఎంపీటీసీ వెంకట స్వామి, విక లాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకట సుబ్బయ్య సునీల్, వైయస్సార్సీపి ఎస్సీ సెల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోళ్లభాస్కర్, ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణమూర్తి, సూర్యనారాయణ, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు అగ్ర హారం రవి, షకూర్, యోహాన్ పాల్గొన్నారు.

# కుట్టు మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానం

## ఎంపీడీవో రమణారెడ్డి

పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ పోరుమామిళ్ల మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అర్హులైన బిసి, ఈడబ్ల్యూఎస్, కాపు మహిళలు కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రమణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు గ్రామ సచివాలయం లోని వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. వీటిని పరిశీలించిన అనంతరం అర్హులను ఎంపిక చేసి అనంతరం వీరిని నియోజ కవర్గస్థాయిలో శిక్షణ ఇస్తారని ఆయన పేర్కొన్నారు.

# మహిళా ఉపాధ్యాయులపై భౌతిక దాడి హేయమైన చర్య

## - బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు పి.సుష్మా



వేంపల్లె మేజర్ న్యూస్: మహిళా ఉపాధ్యాయులపై భౌతిక దాడి చేయడం హేయమైన చర్య అని బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు పి.సుష్మా అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులైన అంజలిపై దాడి, సునీతపై అసభ్య పదజాలంతో దూషించిన ఘటన సభ్య సమాజాన్ని తలదించేలా చేసిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా సగర్వంగా జరుపుకునే సందర్భంలో తోటి ఉపాధ్యాయుడు మహిళా ఉపాధ్యాయులపై దాడి చేయడమనైది సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం బేటి బాచావో బేటి పడావో నినాదంతో ముందుకెళ్తుంటే.. ఇలాంటి సంఘటనలు జరగడం చాలా బాధాకరమన్నారు. పిల్లలకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడు ఇలాంటి చర్యలకు పాల్పడితే బాలికలు పాఠశాలలకు ఏవిధంగా రాగలుగుతారని ప్రశ్నించారు. పీజీటీ ఉపాధ్యాయుడిని, పాఠశాలకు రాకుండా చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఘటన జరిగిన వెంటనే సమయస్ఫూర్తితో పోలీసులకు ఫిర్యాదు చేయడం అభినందనీయమన్నారు. అధికారులు స్పందించిన తీరు పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించాలని కోరారు.

# బీసీ వర్గాలను బలోపేతం చేయాలి

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి ఎస్.సవిత



కడప ప్రతినిధి - మేజర్ న్యూస్ జిల్లాలో వెనుకబడిన తరగతుల వర్గాలను బలోపేతం చేసి ముందుకు నడిపించాలని.. రాష్ట్ర వెనుకబడిన తరగతులు, బలహీన వర్గాల సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక అతిథి గృహంలో.. బీసీ సంక్షేమ శాఖాధికారులు, ఎంజేపీ (మహాత్మాగాంధీ జ్యోతిరావుపూలే) విద్యా లయాల ప్రిన్సిపాళ్లు, చ్హేనేత జౌళిశాఖ అధికారులతో..మంత్రి ఎస్.సవిత సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నారు. అందుకు అనుగుణంగా.. అధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయు తంగా కృషి చేయాలన్నారు. ఎంజేపీ స్కూళ్లలో చిన్న చిన్నమరమ్మ తులకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి నిధులు సమీకరిం చాలన్నారు. జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధిలో భాగంగా.. ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి సీఎస్ఆర్ నిధుల సేకరణకు ప్రయత్నిం చాలని సూచించారు. సీఎస్ఆర్ నిధులను అందించేందుకు ముందు కొచ్చేవారి.. సొంత నియోజకవర్గాల్లోని సంక్షేమ హాస్టళ్లను, ఎంజేపీ స్కూళ్లను ప్రధాన్యతతో అభివృద్ధి చేస్తామని కూడా దాతలకు తెలియ జేస్తూ.. వారిని ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని ఆయా నియోజక వర్గాల్లోని సంక్షేమ హాస్టళ్లలో చేపట్టాల్సిన మరమ్మతుల కోసం ఎమ్మెల్యేలు, ఎంపీలు ముందుకొస్తారన్నారు. ఓనిపెంట ఎంజేపీ స్కూల్ లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ప్రవేశాల అనుమతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళతామని మంత్రి హామీ ఇచ్చారు. హాస్టళ్ల సొంత భవనాల నిర్మాణం కోసం స్థల సేకరణ కు స్థానిక ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలన్నారు.

అనంతరం త్వరలో ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను ఏవిధంగా సమయాత్తం చేస్తున్నారని బీసీ సంక్షేమ శాఖ అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందుకుంటున్న లబ్ధిదారులు యూనిట్ల స్థాపనకు తీసుకుంటున్న చర్యలు, ఆ వివరాలపై సంబందిత అధికారులతో మంత్రి సమీక్షించారు. ప్రస్తుత నూతన బడ్జెట్లో భాగంగా.. లబ్ధిదారులకు త్వరలో ఆటోలను కూడా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు.

### ఆప్కోలో అమ్మకాలు ప్రోత్సహించండి..

జిల్లాలోని ఆప్కో వస్త్రాలయాలల్లో అమ్మకాలను మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని మంత్రి సవిత ఆదేశిస్తూ... ఆప్కో షోరూమ్‌లలో ఎంతమంది సిబ్బంది ఉన్నారనే వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధుల సహకారంతో అర్హులైన చేనేతలను యూనిట్ల స్థాపనకు ప్రోత్సహించాలని ఖాదీ గ్రామీణాభివృద్ధి శాఖాధికారులను మంత్రి సవిత ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి అన్ని సంక్షేమ హాస్టళ్లలోనూ సన్న బియ్యంతో వండిన భోజనాన్నే విద్యార్థులకు ఉపయోగించాలని బీసీ సంక్షేమ శాఖల అధికారులను అదేశించాయి. సమావేశంలో తెదేపా పొలిటీ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులు రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి భరత్ రెడ్డి, హ్యాండ్ లూమ్స్ డెవెలప్మెంట్ అధికారి అహ్మద్, బీసీ సంక్షేమ హాస్టళ్ల వేల్ఫేర్ అధికారులు, ఎంజేపీ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# వైయస్ అభిషేక్ మృతి మాకు తీరని లోటు

## దుష్ప్రచారంలో ఆరితేరిన ఎల్లో మీడియా..!
## వంత పాడుతున్న ప్రభుత్వ పెద్దలు
## గుడ్డ కాల్చి ముఖాన కొట్టుతున్నారు... మసి కడుక్కోవాల్సి వస్తోంది

## తొండూరు మండల వైకాపా ఇన్చార్జ్ వైఎస్ మదనమోహనరెడ్డి



పులివెందుల అర్బన్ మేజర్ న్యూస్ వైయస్ అభిషేక్ రెడ్డి మృతి తీరని లోటు అని ఆ బాధ నుండి మా కుటుంబం మొత్తం కోలుకోలేకపోతున్నామని దుష్ప్రచారాలతో ఎల్లో మీడియా ప్రభుత్వ పెద్దలు వంత పాడుతూ గుడ్డ కాల్చి ముఖాన కొడుతున్నారని వైయస్ అభిషేక్ రెడ్డి తండ్రి తొండూరు మండల వైకాపా ఇంచార్జ్ వైయస్ మదన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఒక అపద్దాన్ని పదేపదే చెబుతూ అదే నిజమని ప్రజలు నమ్మిందాలని ఎల్లోమీడియా శక్తి వంచన లేకుండా పని చేస్తోంది. అనారోగ్యంతో మాకు కుమారుడు వైఎస్ అభిషేక్రెడ్డి చనిపోయారు. శక్తివంచన లేకుండా వైద్యులు ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. కోమా నుంచి తేరుకుంటారని ఆశించాం, దేవుడు చిన్నచూపు చూడడంతో మృతి చెందారు. మా కుటుంబానికి వైఎస్ అభిషేక్ రెడ్డి చనిపోవడం తీరనిలోటు, బిడ్డల్ని చూస్తే కడపు తరుక్కుపోతుంది. ఇలాంటి పరిస్థితులల్లో మేముంటే చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సాకులు ఒక్కొక్కరుగా అర్ధాంతరంగా చనిపోతున్నారని, అందులో కుట్ర దాగిందని ఈనాడు, ఆంధ్ర జ్యోతి పెడార్థాలు తీస్తూ ఇష్టానుసారం కథనాలు వండివార్పుతోంది. ఎల్లో మీడియాకు తగ్గట్లుగా అదిగో పులి అంటే ఇదిగో తోక అన్నట్లుగా ప్రభుత్వ పెద్దలు మాటలుంటున్నాయి. మా మామ డాక్టర్ ఈసీ గంగిరెడ్డి కరోనా వైరస్లో చనిపోయారు. మొన్న వాచ్మెన్ రంగన్న చనిపోయారు. రంగన్న ఆయాసం ఉందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మనందరికీ కూడా తెలుసు. సహాజ మరణాలను అసహాజ మరణాలుగా చిత్రికరించేందుకు ఒక పథకం ప్రకారం ఎల్లోమీడియా పనిచేస్తోంది. బయటి ప్రపంచానికి పులివెందులలో దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని తెలియజెప్పేందుకు విశ్వయత్నం చేస్తోంది. వారి దుష్ప్రచారానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దల చర్యలున్నాయి. ఎల్లో మీడియా ఇటు ప్రభుత్వం ప్రవర్తన అసహ్యామేస్తోంది.

### జ్యుడిషియల్ విచారణ చేపట్టండి...

రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జ్యుడిషియల్ దర్యాప్తుకు ఆదేశించాలి. చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షులుగా ఉన్నవారు మృతి చెందిన వ్యవహారంపై సిట్ దర్యాప్తు అంటేనే ఏదో కుట్ర దాగి ఉందని అనుమానం వస్తోంది. సిట్ కాదు జ్యుడిషియల్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయిస్తే ఎవ్వరికి ఎలాంటి అభ్యంతరం లేదు. కూటమి ప్రభుత్వం పెడుతోన్న అడ్డగోలు కేసులు చేపట్టుతోన్న ఏకపక్ష విచారణ అందరం చూస్తున్నాం. కాబట్టి జ్యుడిషియ విదారణ కోరుతున్నాం. చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

# ప్రజా సమస్యల సత్వరమే పరిష్కరించాలి : టిడిపి ఇన్చార్జ్ భూపేష్ రెడ్డి

జమ్మలమడుగు మేజర్ న్యూస్:నియోజకవర్గంలోని ప్రజల నుంచి వచ్చే సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యలను పరిష్కరించాలని తెలియజేశారు. నియోజవర్గంలో ఏ సమస్యలను ప్రజలు వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని అప్పుడే ప్రశాంతమైన జీవితం కొనసాగుతుందన్నారు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాలను నాయకులు కార్యకర్తలు ప్రజలకు చేరవేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



# నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో
# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



కడప మేజర్ న్యూస్ నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థల మహిళా సాధికారతను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలను చేపట్టాయి. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు, ఆరోగ్య కార్యకర్తలు, సమాజ సేవకులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. మహిళా సాధికారత, ఉద్యోగ అవకాశాలు, ఆరోగ్య పరిజ్ఞానం వంటి అంశాలపై ప్రేరణాత్మక ప్రసంగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు ఎన్ సుబ్బరామిరెడ్డి కళ్యాణి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి లేకుండా సమాజ పురోగతి సాధ్యం కాదు. నిహార్ సంస్థల ద్వారా మహిళలకు ఉద్యోగావ కాశాలు, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సేవలను అందించేందుకు కృషి చేస్తున్నాం" అని తెలిపారు. కార్యక్రమం చివరిలో మహిళా ఉద్యోగులను, నిపుణులను సన్మానించి, వారికి ప్రత్యేక ప్రశంసా పత్రాలను అందజేశారు.

# ముస్లింల భూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయండి

## ముస్లిం సోదరులకు అండగా నిలుస్తా
## కొత్త మసీదుల నిర్మాణానికి ప్రభుత్వం తరపున సహాయం చేస్తాం

## పులివెందుల ఆర్డిఓ కి వినతి పత్రాన్ని అందించిన బీటెక్ రవి






పులివెందుల మేజర్ న్యూస్ ముస్లిం సోదరుల భూసమస్యలను త్వరితగతిన పూర్తి చేయండి అని పులివెందుల ఆర్డీవో కు శనివారం పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో బీటెక్ రవి మాట్లాడుతూ పులివెందులలో ముస్లింలకు అండగా ఉంటాం గతంలో ముస్లింలుకు ఇచ్చిన భూములను సర్వే చేసి వారి హద్దులు వారికి ఉండేలా చేస్తామని, ముస్లిం సోదరుల ఇనామ్ భూసమస్యలను పరిష్కారం చేసి వారికి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. పులివెందుల మున్సి పాలిటీ ముస్లిం సోదరలు నమాజ్ చేసుకొవడానికి ఇబ్బందిగా ఉంది దూరం ఉండటం వల్ల కొత్త మసీదుల నిర్మాణానికి ప్రభుత్వం తరపున సహాయం చేస్తామని తెలిపారు. పులివెందుల మున్సిపాలిటీ ఎవరికి ఇబ్బంది లేకుండా కొత్త మసీదులను నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్య క్రమంలో ముస్లింసోదరులు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# జాతీయ లోక అదాలత్‌లో 283 కేసులు పరిష్కారం

**53 లక్షల 57 వేల 663 పరిహారం చెల్లింపు**
**సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ**

**బద్వేల్ మేజర్‌న్యూస్ :** బద్వేల్ కోర్టు సభా భవనం నందు హైకోర్టు ఉత్తర్వుల మేరకు జాతీయ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించినట్లు ప్రకటనలో తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులు హైకోర్టు ఉత్తర్వుల మేరకుపరిష్కార దిశగా జాతీయ లోక్ అదాలత్ చైర్మన్, న్యాయ సేవా సంస్థ బద్వేల్ సీనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో బద్వేల్ కోర్టు భవనం నందు రెండు బెంచ్ లను ఏర్పాటు చేశామన్నారు. మొదటి బెంచి సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ రెండవ బెంచికి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి కడప ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్రిమినల్ కేసులు 269 సివిల్ 14 కేసులు పరిష్కరించామని బాధితులకు క్రిమినల్ కేసులకు సంబంధించి7 లక్షల31 వేల రూపాయలను అదేవిధంగా సివిల్ కేసులకు సంబంధించి 46లక్షల. 26 వేల 662 రాజీమార్గాన బాధితులకు అందజేశామని వారు ఆమె తెలిపారు.కేసులు పరిష్కార దిశగా కృషి చేసిన న్యాయవాదులకు పోలీస్ సిబ్బంది సహకారంతోనే కేసులు పరిష్కారం అయ్యాయి అన్నారు. ప్రతి ఒకరు కేసులకు సంబంధించి లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తత్వారిగిన కోర్టు కేసుల నుంచి విముక్తి పొందాలని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

# కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం





**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్:** పోరుమామిళ్ల సబ్ ఇన్స్పెక్టర్ కొండారెడ్డి ఆదేశాల మేరకు పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది మహిళా దినోత్సవం సందర్భంగా కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినులకు కేకులు, మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మహిళల భద్రత, మహిళా సాధికారత మరియు మహిళా చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ లో ఎస్సై కొండారెడ్డి మహిళ దినోత్సవం సందర్భంగా విధులు నిర్వహిస్తున్న మహిళ సిబ్బంది అయిన మీనాక్షి ని సత్కరించడం జరిగింది.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**నూర్ భాషా సంఘ చైర్మన్ ఓతురు రసూల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు**



**పులివెందుల మేజర్ న్యూస్ :** పులివెందుల మండలం ఎర్రిపల్లె గ్రామం జామియా మసీద్ నందు వైసిపి రాష్ట్ర నూర్ భాషా సంఘ చైర్మన్ ఓతురు రసూల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయ మతసామరస్యానికి ప్రతీక అని, అంతేకాకుండా సర్వమత సారం ఒక్కటేనని మనుషులంతా సోదరా భావంతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ నూరుల్లా మురారి చింతల ప్రెసిడెంట్ బాబా రజాఖ్ ఎంపిటిసి ముస్తఫా బాదుల్లా ఓ.బరా జీ.బారా ముక్తావలి ఖాదర్ భాషా తదితరులు పాల్గొన్నారు

# ఎపియన్‌జిజివో అసోసియేషన్ మహిళ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**చైర్మెన్ యమ్. శాంతమ్మ**



**కడప సిటీ, మేజర్‌న్యూస్:** అధ్యక్షతన సమావేశం జరిగింది ముఖ్య అతిధిలుగా జిల్లా ఎన్జీవో అధ్యక్షులు బి. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్‌లి, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, ఉమెన్ వింగ్ కన్వీనర్ భారతి,రాష్ట్ర ఉమెన్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నిర్మల జ్యోతి.మరియు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. రాజ్య లక్ష్మి, ఎస్ సి కార్పొరేషన్ రోజా రాణి ప్రిన్సిపాల్ యమ్‌పి హెచ్ ట్రైనింగ్ స్కూల్, కడప, ప్రిన్సిపాల్ వై. జయ లక్ష్మి, ట్రైనింగ్ స్కూల్, కర్నూల్ వారు పాల్గొన్నారు. జిల్లా చైర్మెన్ శాంతమ్మ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రావీణ్యాం సాధించాలని. ప్రతి మహిళా విద్యావాంతులు కావాలన్నారు. కన్వీనర్ విజయ భారతి మాట్లాడుతూ జిల్లా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడ పోటీలు నిర్వహించమన్నారు. జిల్లా అధ్యక్షులు బి. శ్రేనివాసులు మాట్లాడుతూ ఈరోజు ముఖ్య మంత్రి గారు మహిళలకు ఎన్నో కాన్పు అయినా 180 రోజులు లీవ్ శాంక్షన్ చేసినందులకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. మహిళా మణులుకు అంతర్జాతీయ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ మహిళలు విద్యా, ఉద్యోగ, రాజకీయ, సేవా కార్యక్రమాల్లో పోటీ పడి అన్నిరంగాల్లో ఉన్నారని, రాష్ట్రపతి, కేంద్ర ఆర్థిక మంత్రి, ఢిల్లీ ముఖ్యమంత్రి మహిళా లే అని వారిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు, అమ్మగా చెల్లి గా, భార్య గా, సోదరీగా, గృహణి గా సేవలనదిస్తున్న మహిళలు అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆటల పోటిల్లో లెమన్ స్పూన్, టేనికట్, త్రోబాల్, కబడి, వాలి బాల్, డిస్క త్రో, జావిల్లిన్ త్రో, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్ పోటిలల్లో గెలుపొందిన మహిళాలందరికి బహుమతులు ప్రదానం చేసారు. ఈకార్యక్రంలో జ్యోతి, ప్రమీల్ల, పద్మ, శాంతి, సుహాసిని, లక్ష్మి, కృష్ణకుమారి, ప్రసనలత, ఏ.కె పద్మజ, ఏపీ ఎన్జీవో జిల్లా నాయకులు నిత్యపూజయ్య, తిమ్మా రెడ్డి, టీ.శ్రీనివాసులు, రాజశేఖర్, వాసన్,నరసింహ రెడ్డి, సిటీ అధ్యక్షులు చిన్నయ్య,నాగార్జున, పద్మనాబాం, ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

# వేముల లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు



**వేముల, మేజర్‌న్యూస్:** వేముల మండలం లోని స్థానిక వేముల లో ఉన్నటువంటి స్త్రీ శక్తి భవనం నందు శనివారం ఉదయం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం ను ఎపియం ఆంజనేయులు ఆద్వర్యం లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం కి ముఖ్య అతిథిలుగా వేముల జడ్పీటీసీ కొకటం వెంకట బయపు రెడ్డి,వేముల ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ హాజరయ్యారు.ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేముల జడ్పీటీసీ కొకటం వెంకట బయపు రెడ్డి,వేముల ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ డ్వాక్రా మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు వృత్తి పరమైన అభివృద్ధి చెందాలని, ప్రతి ఒక్క మహిళా ఆర్థికం గా బలోపేతం కావాలని,మహిళలు పురోగతి సాధించాలంటే ఒంటరిగా ప్రయత్నం కాకుండా సమిష్టి కృషి చేయాలి అని, ఇది ఆర్థిక వృత్తి పరమైన అభివృద్ధి కి ,స్త్రీ సామర్థ్యానికి గుర్తించడానికి ఉపయోగ పడుతుంది అని అన్నారు.అనంతరం వారు డ్వాక్రా మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలను ఏర్పాటు చేసి త్రో బాల్ ఆటను ప్రారంభించారు.ఈ ఆటల పోటీలను జడ్పీటీసీ కొకటం వెంకట బయపు రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులను అందజేశారు.అంతక ముందు వేముల జడ్పీటీసీ కొకటం వెంకట బయపు రెడ్డి,వేముల ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ లను డ్వాక్రా మహిళలు సిబ్బంది ఘనంగా సన్మానించారు.వారికి జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమం లో సిబ్బంది జైపాల్,పవన్,డ్వాక్రా సభ్యులు ఉన్నారు

# మహిళా దినోత్సవ వేడుకలు



**ముద్దనూరు, మేజర్‌న్యూస్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ముద్దనూరు పోలీస్ స్టేషన్లో జరిగాయి. మహిళా పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొని మహిళా దినోత్సవం వేడుకలను చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# అత్యంత ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**పులివెందుల, మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణంలో అమ్మవారి శాల నందు వాసవి క్లబ్, వనిత క్లబ్, ఆవోప సంఘం ఆధ్వర్యంలో 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న మహిళా మణులకు పాదపూజ సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి మరియు వనిత క్లబ్ అధ్యక్షురాలు మేడ సుబ్బరత్నమ్మ, వాసవి క్లబ్ అధ్యక్షులు రొట్టెల వినోద్ కుమార్, ఆవోపా సంఘం అధ్యక్షులు మేడం దినేష్ కుమార్, ఆవోపా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మేడ సాయి బాబా,వాసవి క్లబ్ జోన్ చైర్ పర్సన్ సగళా మహేంద్ర బాబు, మహిళా మండలి మరియు వనిత క్లబ్ సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు, ఆవోపా సంఘం సభ్యులు పాల్గొన్నారు. వాసవి క్లబ్ సెక్రటరీ మిట్ట మహేశ్వర గుప్తా తెలిపారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు




**పులివెందుల అర్బన్, మేజర్‌న్యూస్ :** పులివెందులలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారని కళాశాల ప్రిన్సి పాల్ డా.బి.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి మహిళల పాత్ర ఎంతో ప్రాముఖ్యమైనది కావున చదువు పట్ల,ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి డా.పావని, నాగసుమ (పబ్బతి టెక్స్‌టైల్స్ యజమానురాలు) మాట్లాడుతూ మహిళలు కుటుంబ పోషణ విషయమై అవగాహన పెంచుకోవాలని,అలాగే ఆర్థికంగా బలో పేతమవుతూ నేటి యువత అన్నింటిలోనూ ముందుకు సాగాలని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ డా.సి.బాలనారాయణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషుల తో సమానంగా ఎదగాలని అన్నారు. ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.శ్రీ నీత మాట్లాడుతూ మహిళల సైకాలజీ ప్రకృతి రీత్యా తేడా ఉంటుంది కావున అన్ని విషయాల్లోనూ సమతుల్యతతో వ్యవహరించాలని తెలిపారు. ఉమెన్ ఎంప వర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డా.కె.విజయలక్ష్మి మాట్లాడుతూ వచ్చిన అవకా శాలను అందిపుచ్చుకొని ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరుకునేలా జీవితాన్ని మలుచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పులివెందల ఫిల్మ్ మే కర్స్ శ్రావణ్ కుమార్ వారి చిత్ర బృందం కొత్తగా రిలీజ్ కాబోతున్న సినిమాలోని మహిళా ప్రాధాన్యతను తెలియజేసే పాటను విడుదల చేస్తూ విద్యార్థులకు వీనుల విందు కావించారు. ఈ కార్యక్రమంలో డా.సుగుణమ్మ, డా.రాధిక, జనార్ధన, డా.రమీజా, హేమావతి, వాణి, లిఖిత, శ్రీనివాసులు, గంగిరెడ్డి, మహేందర్ రెడ్డి, గౌతమి, సృజన,మస్తాన్ బి,ఆనందరావు, ప్రశాంతి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.